మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 08 ఆదివారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 83

తెలంగాణలో మార్పు
బీజేపీతోనే సాధ్యం

- కాంగ్రెస్ ఎక్కడైనా ప్రాంతీయ పార్టీల పైనే ఆధారపడింది
- మహారాష్ట్రలో అధికారంలోకి వచ్చాం..తెలంగాణలోనూ విజయం మాదే
- కాంగ్రెస్ హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శ
- సరూర్‌నగర్ స్టేడియం సభలో జేపీ నడ్డా విమర్శలు

హైదరాబాద్-నవభూమిబ్యూరో
దేశంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీల పైనే ఆధారపడిందని, బీజేపీతో నేరుగా తలపడిన ఏ రాష్ట్రంలో కూడా గెలవలేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశంలోని 13 రాష్ట్రాల్లో బీజేపీ, 6 రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉందని తెలిపారు. జమ్ము కశ్మీర్‌లో సింగిల్ గా అత్యధిక సీట్లతో విపక్షంలో ఉన్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో అధికారంలోకి వచ్చామని... తదుపరి ఎన్నికల్లో తెలంగాణలోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి

ఈవీఎంలపై వినూత్న పోరు

- మహారాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను బహిష్కరించిన మహా వికాస్ అఘాడీ
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లల్లో మోసాలకు పాల్పడటం వల్లే
- మహాయుతి అధికారంలోకి వచ్చిందంటూ అఘాడీ నేతల ఆరోపణ
- ఈవీఎంలల్లో మోసాలను నిరసిస్తూ తాము ప్రమాణ స్వీకారం చేయట్లేదని
- మహా వికాస్ అఘాడీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి ఆదిత్య థాకరే ప్రకటన
- మహా యుతి సర్కార్‌ను ఈవీఎం ప్రభుత్వంగా అభివర్ణన

ముంబై-నవభూమిబ్యూరో: మహారాష్ట్ర రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. 10 రోజుల పాటు ఎడతెగకుండా సాగిన ముఖ్యమంత్రి అభ్యర్థి హైడ్రామాకు తెరపడినప్పటికీ- మరో పోరు అక్కడ మొదలైంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సారథ్యంలోని మహాయుటి సర్కార్‌ను ఉక్కిరి బిక్కిరి చేసే దిశగా తాజా పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ బహిష్కరించడం అనూహ్య పరిణామం. కొత్త శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాలు ఇవి. దీన్ని బాయ్‌కాట్ చేసింది. అసెంబ్లీలో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయదలచుకోలేదని ప్రకటించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లల్లో మోసాలకు పాల్పడటం వల్లే మహాయుతి అధికారంలోకి వచ్చిందంటూ అఘాడీ నాయకులు ఆరోపిస్తోన్నారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ పెద్దలు ఖూనీ చేశారంటూ నిప్పులు చెరుగుతున్నారు. తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోన్న మహాయుతి మరోసారి అధికారంలోకి రావడానికి ఈవీఎంలే కారణమంటూ విమర్శలు చేస్తోన్నారు. ఈవీఎంలల్లో జరిగిన మోసాలను నిరసిస్తూ తాము ప్రమాణ స్వీకారం చేయదలచుకోలేదని మహా వికాస్ అఘాడీ శాసన సభ్యుడు, మాజీ మంత్రి ఆదిత్య థాకరే ప్రకటించారు. ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కాదని ధ్వజమెత్తారు. మహాయుతి సర్కార్‌ను ఈవీఎం ప్రభుత్వంగా

కేసీఆర్ కలిసి వస్తే..
దిల్లీలో ధర్నా చేద్దాం

- తెలంగాణ రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో సీఎం దీక్ష చేయాలన్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్,హరీశ్ సవాల్
- రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలో దీక్షకు సిద్ధమేనన్న సీఎం రేవంత్
- రాష్ట్రానికి నిధుల కోసమైనా ప్రతిపక్షనేత కేసీఆర్ ముందుకు రావాలన్న సీఎం

హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన డిమాండ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను దేశరాజధాని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకు రావాలన్నారు. కేసీఆర్‌తో కలిసి ఢిల్లీలో ధర్నా చేస్తానని సీఎం రేవంత్ తెలిపారు. మీరే తేదీని డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధమంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు?. "ఉచిత కరెంట్ మీకు వర్తించటం లేదా? అయితే ఇలా

షర్మిలకు ఎదురుగాలి?

- ఏపీ కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామం
- షర్మిలకు వ్యతిరేకంగా కూడగడుతున్న అసమ్మతి
- షర్మిలపై వరుసగా అధిష్టానానికి ఫిర్యాదులు
- ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ కూడా షర్మిలను టార్గెట్ చేస్తూ ఆరోపణలు
- వైసీపీ బలహీనపడుతున్న తరుణంలో ప్రత్యామ్నాయ శక్తిగా మారే అవకాశాలు

అమరావతి-నవభూమిబ్యూరో:ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతోంది. కూటమి నేతలు వైసీపీ లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ పీసీసీ చీఫ్ షర్మిల ఏపీలో ఎన్డీఏ కూటమి కంటే జగన్ పైన ఎక్కువగా టార్గెట్ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. సొంత పార్టీ నేతలను సమన్వయం చేసుకోవటం లేదంటూ ఢిల్లీకి ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా ఢిల్లీ కేంద్రంగా చోటు చేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ లో కొత్త చర్చకు కారణమవుతున్నాయి. ఏం జరుగుతోంది అనేక తర్జన భర్జనల తరువాత ఏపీ పీసీసీ చీఫ్‌గా షర్మిల నియమితులయ్యారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి షర్మిల దూకుడుగా వ్యవహరిస్తున్నారు. జగన్ లక్ష్యంగా ప్రధానంగా షర్మిల ఏపీలో రాజకీయం చేస్తున్నారనే అభిప్రాయం ఉంది. వ్యక్తిగత వివాదాల పైన పదే పదే ప్రస్తావన చేయటం కూడా పార్టీలో చర్చగా మారింది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పైన కాంగ్రెస్ పోరాటం చేస్తోంది. రాష్ట్రంలో మాత్రం షర్మిల ఎన్డీఏ కూటమి కంటే జగన్ పైనే ఎక్కువగా గురి పెట్టినట్లు వస్తున్న కథనాలతో కొందరు కాంగ్రెస్ నేతలు పార్టీకి మేలు చేసే విధంగా పీసీసీ చీఫ్ వ్యవహరించటం లేదని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వరుస ఫిర్యాదులు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టే సమయంలో పలువురు పార్టీ సీనియర్లు షర్మిలకు మద్దతుగా నిలిచారు. కానీ, కాల క్రమేణా వారంతా పార్టీకి దూరంగా ఉంటున్నారు. పరిమిత సంఖ్యలో నేతలు మాత్రమే షర్మిల నిర్ణయించిన కార్యక్రమాలకు పరిమితం అవుతున్నారు. షర్మిల వైఖరి పైన గుర్రుగా ఉన్న సీనియర్లు ఎప్పటికప్పుడు పార్టీ వ్యవహారాల గురించి హైకమాండ్ కు సమాచారం పంపిస్తున్నట్లు తెలుస్తోంది. షర్మిల సోషల్ మీడియా వేదికగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాల్సి ఉండగా..ఎన్నికల్లో ఓడిన వైసీపీని లక్ష్యంగా చేసుకోవటం వెనుక పర్సనల్ అజెండా ఉందని కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలే అభ్యంతరం

రాజన్న కోడెల అక్రమ విక్రయం
వార్తల్లో నిజం లేదు

- కోడెల అక్రమ విక్రయం వార్తలపై స్పందించిన కొండా సురేఖ
- కోడెలను విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్న మంత్రి
- కోడెల నిర్వహణకు మార్గదర్శకాలను రూపొందించామన్న మంత్రి
- మార్గదర్శకాల ప్రకారమే రైతులకు కోడెలను ఇస్తున్నట్లు వెల్లడి

హైదరాబాద్-నవభూమిబ్యూరో
వేములవాడ దేవస్థానంలో కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని తెలంగాణ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రభుత్వంపై బురదజల్లే రీతిలో కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని, ఈ వార్తలను ఖండిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో

చెరువులోకి
దూసుకెళ్లిన కారు

- యాదాద్రి,భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో దుర్ఘటన
- జలాల్‌పూర్ చెరువులోకి వెళ్లిపోయిన కారు
- ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు జలసమాధి
- ఈత వచ్చిన ఒకరు అద్దాలు పగులగొట్టుకొని బయటకు
- తాటికల్లు తాగేందుకు హైదరాబాద్ నుంచి వలిగొండకు..
- చీకటి..పొగమంచు వల్ల దారి తెలియక చెరువులోకి..

భూదాన్‌పోచంపల్లి-నవభూమి ప్రతినిధి: భదాద్రి భువనగిరి జిల్లాలో దారుణ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ సమీపంలో ఒక కారు చెరువులోకి దూసుకు వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది. చెరువులోకి దూసుకెళ్లిన కారు ఈ ప్రమాదంలో అయిదుగురు విద్యార్థులైన యువకులు చెరువులో జల సమాధి అయ్యారు. ఈ ఘటన వివరాలలోకి వెళితే కొందరు యువకులు తెల్లవారుజామున హైదరాబాద్ నుండి వలిగొండకు బయలుదేరారు.

టీడీపీలో చేరుతున్నా

- ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేసిన వాసిరెడ్డి పద్మ
- టీడీపీ ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన వైనం
- వారం రోజుల్లో టీడీపీలో చేరుతానని వెల్లడి

విజయవాడ-నవభూమి ప్రతినిధి:ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ వైసీపీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె సంచలన ప్రకటన చేశారు. మరో వారం రోజుల్లో తాను టీడీపీలో చేరుతున్నానని చెప్పారు. విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్నిని ఈరోజు వాసిరెడ్డి పద్మ కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. వాస్తవానికి ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందినప్పటి నుంచే ఆ పార్టీకి వాసిరెడ్డి పద్మ దూరంగా ఉంటూ వచ్చారు. ఆ తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన సందర్భంగా వైసీపీ అధినేత జగన్ పై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కార్యకర్తలను జగన్ పట్టించుకోలేదని... గుడ్ బుక్ పేరుతో కార్యకర్తలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు.

విగ్రహావిష్కరణకు కేసీఆర్ వస్తారా?

- కాంగ్రెస్ ప్రభుత్వమేర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు
- ఉత్సవాల్లో భాగంగా 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- కేసీఆర్‌ను రావాలంటూ ఆహ్వానించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వస్తారా..రారా తేల్చని కేసీఆర్
- తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చారంటున్న కేటీఆర్

మహబూబ్ నగర్ జిల్లాలో
భూప్రకంపనలు

- కౌకుంట్ల మండలం దాసరపల్లె కేంద్రంగా ప్రకంపనలు
- రిక్టర్ స్కేల్‌పై తీవ్రతను 3గా గుర్తించిన అధికారులు
- ఇటీవలే ములుగు జిల్లా కేంద్రంగా ప్రకంపనలు

మహబూబ్‌నగర్-నవభూమిబ్యూరో
తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం భూప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై వీటి తీవ్రత 3గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కౌకుంట్ల మండలం దాసరపల్లె కేంద్రంగా మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రకంపనలు వచ్చాయి. భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.
ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించిన విషయం తెలిసిందే. జనాలు ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. అప్పుడు ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.03గా నమోదైంది. భూకంప కేంద్రం నుంచి 225 కిలోమీటర్ల పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది.

పూజా ఖేడ్కర్‌కు ఖేదం

- వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజాకు భారీ ఎదురుదెబ్బ
- అవినీతి ఆరోపణల వ్యవహారంలో యుపీఎస్సీ సంచలన నిర్ణయం
- పూజాఖేడ్కర్ ప్రొవిజనల్ అభ్యర్థిత్వం రద్దు,,భవిష్యత్తులో భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్
- ఆరోపణలపై పూజా స్పందించకపోవడంతో యుపీఎస్సీ నిర్ణయం

ముంబై-నవభూమిబ్యూరో:మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. పూజ ఖేడ్కర్ ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈ మేరకు యూపీఎస్సీ అధికారులు తెలిపారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతోపాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ పూజా ఖేడ్కర్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి పూజ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు యూపీఎస్సీ తాజా ప్రకటనలో వెల్లడించింది. పూజా ఖేడ్కర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించగా సివిల్ సర్వీస్ ఎగ్జామ్ 2022 నియమాలను ఉల్లంఘించినట్టు తేలిందని వివరించింది. ఫలితంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తప్పుడు గుర్తింపును ఉపయోగించి

రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మాత దిల్ రాజు

- జుబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసిన దిల్‌రాజు
- టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమితులైన దిల్ రాజు
- సీఎం రేవంత్‌కు దిల్‌రాజు కృతజ్ఞతలు

విజయవాడ-నవభూమి ప్రతినిధి:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాలీవుడ్ సినీ నిర్మాత దిల్ రాజు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల రేవంత్ రెడ్డి నివాసంలో కలిశారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్ రాజును ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన దిల్ రాజు... తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్కడకు వెళ్లాలని బాగా ఆత్రుతగా ఉందా.. కేటీఆర్‌పై పొంగులేటి సెటైర్

హైదరాబాద్-నవభూమి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. జైలుకు వెళ్లడానికి కేటీఆర్‌కు ఆత్రుత ఎందుకు అంటూ హాట్ కామెంట్స్ చేశారు. తప్పు రుజువైనప్పుడు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు.

ఆ బాధ్యత నెరవేరుస్తా.. సీఎం రేవంత్‌రెడ్డి ఎమోషనల్ ట్వీట్

"నేను బాంబులు అనగానే కేటీఆర్ ఉలిక్కిపడ్డారు.. బాంబులు పేలతాయి అనగానే ఢిల్లీకి ఎందుకు వెళ్లారు. కేంద్ర పెద్దలతో ఏం ఒప్పందం చేసుకున్నారు. నేను అమిత్ షా కాళ్లు మొక్కిన అనడానికి సిగ్గుండాలి.. నా తల్లిదండ్రుల తర్వాత నేను కేసీఆర్ కాళ్లు మాత్రమే మొక్కిన. మెడలో పార్టీ కండువా వేసి ఆ కండువాతో నా గొంతు కోశారు. ఐదేళ్లు నా రాజకీయ జీవితం నాశనం చేశారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నేతలు పగటి కలలు మానుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. రాజీవ్ గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చేది లేదన్నారు. విగ్రహాలు ఉండాల్సిన చోటనే ఉన్నాయన్నారు. రైతులను యువకులను బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేశామని, యువకులకు 57 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఏడాది పాలనలో తాము చెప్పని హామీలు కూడా నెరవేర్చామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్-నవభూమి: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతి అని వివరించారు.ఆప్రేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్, పర్‌ఫ్యుజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 14వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాంపల్లి నుమాయిష్‌కు కొనసాగుతున్న ఏర్పాట్లు..

ఈసారి టికెట్ ధరలు పెంపు..!

హైదరాబాద్-నవభూమి: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నుమాయిష్ నిర్వహణకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జనవరి 1 నుంచి ప్రారంభమై 45 రోజుల పాటు నుమాయిష్ కొనసాగనుంది. నుమాయిష్‌లో స్టాళ్ల నిర్వహణకు 2,500 దరఖాస్తులు రాగా, ఇందులో 2,200 ఫైనల్ చేసినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బీ సురేందర్ రెడ్డి తెలిపారు. రెగ్యులర్‌గా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక గతేడాది కంటే ఈ సారి ఎంట్రీ టికెట్ ధరలు పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో రూ. 40 ఉండగా, దాన్ని రూ. 50కి పెంచుతున్నట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. నుమాయిష్ నిర్వహణ ద్వారా వచ్చిన ఫండ్‌ను పిల్లల ఎడ్యుకేషన్‌కు ఖర్చు చేస్తామన్నారు.

ఇక నుమాయిష్‌లో హ్యాండ్లూమ్స్, రెడీమెడ్ గార్మెంట్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇంటి ఫర్నీచర్, బొమ్మలతో పాటు ఇతర వస్తువులను విక్రయిస్తారని తెలిపారు. ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రోజు రాత్రి 10.30 గంటలకు నుమాయిష్ స్టాల్స్ తెరిచి ఉంటాయన్నారు. శని, ఆదివారాల్లో మాత్రం రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్-నవభూమి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా ఈ నెల 8వ తేదీన హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ ఎయిర్‌షో 30 నిమిషాల పాటు నిర్వహించనున్నారు. ఎయిర్ షోలో భాగంగా వాయుసేన విమానాలు విన్యాసాలు ప్రదర్శించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్యాంక్‌బండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

(1వపేజీ తరువాయి)తాటికల్లు తాగేందుకు బయలుదేరిన వీరంతా మితిమీరిన వేగంతో వెళ్లడంతో పాటు మరోవైపు దట్టమైన పొగ మంచు ఉండటం వల్ల కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకు వెళ్లింది. "ఘోర ప్రమాదం: లారీని ఢీకొనడంతో చిన్నారి సహా ఆరుగురు మృతి" ప్రాణాలతో బయటపడ్డ ఒక విద్యార్థి ఇక చెరువులో నుండి బయటపడడానికి ప్రయత్నించినప్పటికీ ఎవరికీ ఈత రాకపోవడంతో అందులో ఉన్న ఐదుగురు మృతి చెందారు. హర్ష, దినేష్, బాలు, వంశీ, వినయ్ ఈ దారుణ ఘటనలో మృత్యువాత పడినట్టు సమాచారం. ఇక మరో యువకుడు మణికంఠ మాత్రం కారు అద్దాలు పగలగొట్టి ఈత రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రస్తుతము అతనిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మద్యం మత్తులో... ప్రమాదం అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠకు మద్యం టెస్ట్ నిర్వహించగా నిన్న రాత్రి అతను మద్యం తాగినట్టు తెలుస్తుంది. నిన్న రాత్రి కారులో ఉన్న యువకులు అందరూ మద్యం సేవించినట్టు తెలుస్తుంది. ఇక దీనిని బట్టి రాత్రంతా వారు మద్యం తాగి మరల ఉదయం అదే మత్తులో తాటికల్లు తాగడానికి బయలుదేరినట్టు భావిస్తున్నారు. ఐదుగురి కుటుంబాల్లో తీవ్ర విషాదం ఈ క్రమంలోనే ఈ ఘటన జరిగినట్టు తెలుస్తుంది. ఏది ఏమైనా మద్యం తాగి వాహనాన్ని మితిమీరిన వేగంతో నడిపి ఐదుగురు యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మద్యం సేవించి వాహనాలు నడపరాదని పోలీసులు పదేపదే చెప్తున్నా సరే చాలా మంది నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు.

తెలంగాణ తల్లి నూతన నమూనాపై

సంచలన వ్యాఖ్యలు చేసిన రూపకర్తలు..

హైదరాబాద్-నవభూమి: తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తోంది. నూతన విగ్రహ నమూనాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటి నుంచి వివాదం రాజుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ తల్లి రూపాన్ని బీఆర్ఎస్ శ్రేణులు వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన రూపం అద్భుతంగా ఉందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన తాజా నమూనా ఏమాత్రం బాగోలేదని అంటున్నారు.

మరోవైపు ఈనెల 9న సచివాలయంలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం శనివారం నాడు ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కి వెళ్లి మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. అయితే తెలంగాణ తల్లి నూతన విగ్రహ నమూనాపై వస్తున్న కామెంట్స్‌పై రూపకర్తలు గంగాధర్, రమణారెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా వారు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో తెలంగాణ తల్లి రూపకర్తలు గంగాధర్, రమణారెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ తల్లి చేయి కాంగ్రెస్ చేయి కాదు.. అభయహస్తం. చేతులు ఉన్న వాళ్లంతా కాంగ్రెస్ వాళ్లా?. సైకిల్ తొక్కుతున్న వాళ్లంతా ఒక పార్టీకి సంబంధించిన వాళ్లా?. తెలంగాణలో అనేక ప్రత్యేక పండగలు ఉన్నాయి. బతుకమ్మతోపాటు బోనాలు, సదర్, సమ్మక్క సారక్క లాంటి అనేక పండగలు తెలంగాణకి ప్రత్యేకమే. తెలంగాణ తల్లి సాధారణ మహిళగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. పోరాట స్ఫూర్తి కనిపించేలా విగ్రహాన్ని తయారు చేయాలని ఆయన సూచించారు. దేవతలు గుడిలో ఉండాలి, తల్లి ఇంట్లో ఉండాలి. తెలంగాణ తల్లి విషయంలో కేసీఆర్, రేవంత్ ఆలోచనలు వేర్వురుగా ఉన్నాయి. తెలంగాణ తల్లి రూపం కోసం అనేక స్కెచ్‌లు తయారు చేశాం. ప్రజలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారనే అర్థం వచ్చేలా విగ్రహాన్ని తయారు చేశాం. తెలంగాణ సమాజమంతా కొత్త తెలంగాణ తల్లి రూపాన్నే ఇష్టపడుతారు"

హైదరాబాద్ బిర్యానీ ఇష్టమా.. అయితే జాగ్రత్త

హైదరాబాద్-నవభూమి: మీకు బిర్యానీ అంటే ఇష్టమా.. ముఖ్యంగా హైదరాబాద్ బిర్యానీ అంటే లొట్టలేసుకుంటారా.. అయితే మీరు కచ్చితంగా అనారోగ్యానికి గురికాక తప్పదు. ఇటీవల కాలంలో పలు రెస్టారెంట్లు, హోటళ్లలో బిర్యానీలో బయటపడుతున్న విస్తుపోయే విషయాలే ఇందుకు ప్రధాన కారణం. హైదరాబాద్ బిర్యానీ అంటే ఇష్టపడని వారుండరు. సెలబ్రటీల నుంచి సామాన్య ప్రజల వరకు హైదరాబాద్ బిర్యానీ ఫ్యాన్సే. కానీ ఇప్పుడు ఆ ఇమేజ్ దెబ్బతినే పరిస్థితి నెలకొంది. అందుకు వ్యాపారస్తుల నిర్లక్ష్యమే కారణం. బిర్యానీ తయారు చేసే సమయంలో వారి నిర్లక్ష్యం కారణంగా అది కల్తీ అవుతోంది. హోటల్స్‌లోని వంటశాలలు పరిశుభ్రంగా ఉండకపోవడంతో బిర్యానీలో బొద్దింకలు ప్రత్యక్షమవుతున్నాయి. ఎంతో ఇష్టంగా బిర్యానీని తిందామని వచ్చిన కస్టమర్లకు బిర్యానీలో ఇలాంటి కనిపించడం మింగుడుపడని విషయం.బిర్యానీ అంటేనే..కల్తీ ఆహారానికి కేరాఫ్ అడ్రస్‌గా భాగ్యనగరం మారిపోతోంది. రెస్టారెంట్లు, హోటళ్లలో తినే ఆహారంలో రోజుకో వస్తువు బయటపడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాపారుల నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌లో బయట ఫుడ్ తినాలంటేనే భాగ్యనగర వాసులు భయపడే పరిస్థితికి దారితీస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ బిర్యానీ అంటే ప్రతీ ఒక్కరూ లొట్టలేసుకుని మరీ తింటుంటారు. అయితే ఈ మధ్య కాలంలో బిర్యానీలో పలు వస్తువులతో, అనేక జీవులు బయటపడటం కనిపిస్తోంది. దీంతో ఎంతో ఇష్టంగా భావించే హైదరాబాద్ బిర్యానీని తినాలంటే ప్రజలు ఆలోచించే స్థితి నెలకొంది. వామ్మో.. హైదరాబాద్ బిర్యానీనా అనే స్థాయికి వ్యాపారస్తులు తీసుకువస్తున్నారు.

విగ్రహావిష్కరణకు కేసీఆర్ వస్తారా?

హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో తమ ప్రభుత్వం ఏర్పాటై నేటితో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహిస్తోంది రేవంత్ రెడ్డి సర్కార్. పండగ వాతావరణంలో ఈ వేడుకలు ఆరంభం అయ్యాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు అంటే- ఈ నెల 9వ తేదీ వరకు ముమ్మరంగా కొనసాగనున్నాయి. గత ఏడాది గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సారథ్యంలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న భారత్ రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుని రాగలిగారాయన. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి రావడం కాంగ్రెస్ పార్టీకి ఇదే తొలిసారి కావడంతో ప్రజా పాలన విజయోత్సవాలను ఘనంగా జరుపుతోన్నారు. పండగ వాతావరణంలో ఇవి కొనసాగుతున్నాయి. ఈ విజయోత్సవాల్లో భాగంగా సచివాలయంలో తెలంగాణ తల్లి భారీ విగ్రహాన్ని నిర్మించింది ప్రభుత్వం. ఈ విగ్రహాన్ని 9వ తేదీన రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. అదే రోజున సోనియా గాంధీ జన్మదినం కూడా కలిసి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ విగ్రహం రూపురేఖలను కూడా ప్రభుత్వం ఇదివరకే ఆవిష్కరించింది. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో తెలంగాణ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటోంది. మంత్రులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.. ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. జిల్లాల్లో పతాకావిష్కరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించింది ప్రభుత్వం. హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కేసీఆర్‌ను కలిశారు. ఈ వేడుకలకు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం

రేపు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం

8న మధ్యాహ్నం 1 గంటలకు సమావేశం

ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ కానున్న కేసీఆర్

సమావేశం ఉంటుందని వెల్లడించిన కేటీఆర్

హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎల్లుండి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమవుతారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.

ఏం విగ్రహమంటూ కేటీఆర్ ఆగ్రహం

సచివాలయంలో ఏర్పాటు చేస్తోంది తెలంగాణ తల్లి విగ్రహమా? లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని మండిపడ్డారు. నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుందన్నారు. అలాగే రాజీవ్ గాంధీ విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడికే పంపిస్తామన్నారు.

రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మాత

(1వపేజీ తరువాయి)తన సోదరుడు శిరీష్‌తో కలిసి దిల్ రాజు తెలంగాణ సీఎం నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా సినిమా పరిశ్రమ అభివృద్ధి గురించి వారి మధ్య చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి... దిల్ రాజుకు శాలువా కప్పి అభినందించారు.

తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్ రాజును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 2003లో దిల్ సినిమాకు దిల్ రాజు తొలిసారి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారింది. ప్రస్తుతం ఆయన మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

పూజా ఖేడ్కర్‌కు ఖేదం

(1వపేజీ తరువాయి)సివిల్ సర్వీసెస్ పరీక్షలు పరిమితికి మించి రాయడంపై జులై 18న పూజా ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జులై 25లోగా దీనిపై సమాధానం చెప్పాలని పూజను ఆదేశించింది. దీనిపై స్పందించిన ఆమె.. ఆగస్టు 4 వరకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలోనే పూజ విజ్ఞప్తిని పరిశీలించిన యూపీఎస్సీ.. జులై 30 మధ్యాహ్నం 3.30 గంటల వరకు అనుమతించింది.

రాములమ్మ ఊసే పట్టని కాంగ్రెస్?

హైదరాబాద్-నవభూమిబ్యూరో

మెదక్ లోక్‌సభ నుంచి పోటీచేసి గెలుపొందారు. తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే క్రమంలోనూ టీఆర్ఎస్ తరఫున ఉన్న ఏకైక ఎంపీ కూడా విజయశాంతినే. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక.. కేసీఆర్ ఆమెను పక్కన పెట్టడం ప్రారంభించారు. దీంతో వెంటనే ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆమె స్టార్‌డమ్‌ను గుర్తించిన పార్టీ ఆమెను 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోల్తా కొట్టడంతో ఆ వెంటనే మళ్లీ ఆమె బీజేపీ గూటికి చేరారు. మునుగోడు ఉప ఎన్నిక ముందు వరకు కూడా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇక.. మునుగోడు ఉపఎన్నిక ముగిసిన వెంటనే మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అయితే.. విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ ఇప్పటివరకు కూడా ఆమెకు పెద్దగా ప్రయారిటీ దొరకడం లేదు. పార్టీ నేతలు ఎవరు కూడా ఆమెను పట్టించుకున్నట్లుగానూ కనిపించలేదు. 2023 నవంబర్‌లో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరగా.. ఆమె అధిష్టానం ప్రచార కమిటీ, ప్లానింగ్ కమిటీ చీఫ్ కో ఆర్డినేటర్, కన్వీనర్‌గా నియమించింది. దీంతో ఆమె రాష్ట్రవ్యాప్తంగానూ ఎన్నికల్లో జోరుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. ఏడాది సంబరాలు జరుగుతున్నా ఇంతవరకు ఆమె ఎక్కడా కనిపించలేదు. అధికారం చేపట్టిన కొత్తలో కేవలం ట్వీట్లకు పరిమితం అయ్యారు. ఇప్పుడు పార్టీ మంచి ఊపులో ఉన్నప్పటికి కూడా ఆమెకు పెద్దగా ప్రాధాన్యం దక్కడం లేదు. అసలు విజయశాంతి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారా అన్న అనుమానాలు సైతం ఆ పార్టీలో కనిపిస్తున్నట్లు టాక్ నడుస్తున్నది. అయితే.. ఆమె పదేపదే పార్టీలు మారడం వల్లే ఈ దుస్థితి వచ్చినట్లుగా రాజకీయ నిపుణులు అంటున్నారు. రాజకీయాల్లో తప్పడుగులు వేస్తే పొలిటికల్ ఫ్యూచర్ ఇలానే ఉంటుందని చెప్పడానికి విజయశాంతి ఎగ్జామ్‌పుల్ అయిపోయారు. ఇక ముందు ముందు విజయశాంతి రాజకీయ భవితవ్యం ఎలా ఉండబోతున్నదా అన్న చర్చ సైతం నడుస్తున్నది.

ఈవీఎంలపై వినూత్న పోరు

(1వపేజీ తరువాయి)అభివర్ణించారాయన. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 149 సీట్లల్లో పోటీ చేసి 132 చోట్ల గెలిచింది బీజేపీ. షిండే వర్గం శివసేన 81 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగా 57 మంది గెలుపొందారు. అజిత్ వర్గానికి చెందిన ఎన్సీపీ మొత్తం 59 స్థానాల్లో పోటీ చేయగా 41 సీట్లు ఈ పార్టీ ఖాతాలో పడ్డాయి. దీనిపై మహా వికాస్ అఘాడీ మొదటి నుంచీ పలు అనుమానాలను వ్యక్తం చేస్తూ వస్తోంది. " స్వయంగా శరద్ పవార్ ఈ ఫలితాలపై స్పందించారు అప్పట్లో. మోసం జరిగిన మాట వాస్తవమేనని, దీనిపై ఎలాంటి సాక్ష్యాధారాలు ఉండట్లేదని ఆయన వాపోయారు. ఈవీఎంల ద్వారా మహాయుతి అధికారంలోకి వచ్చిందంటూ ఆక్షేపించారు. ఈ ఎన్నికలు వాస్తవ ప్రజా తీర్పునకు అద్దం పట్టలేదని అన్నారు. మహా వికాస్ అఘాడీ 46 నియోజకవర్గాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఇందులో శివసేన (ఉద్ధవ్ ఠాకరే వర్గం) వర్గం- 20, కాంగ్రెస్- 16, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) 10 చోట్ల విజయం సాధించింది. తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఇంత భారీ మెజారిటీతో గెలవడం అసాధ్యమంటూ మహా వికాస్ అఘాడీ చెబుతోంది.

షర్మిలకు ఎదురుగాలి?

(1వపేజీ తరువాయి)వ్యక్తం చేస్తున్నారు. ఏకపక్షంగా షర్మిల వ్యవహరిస్తున్న తీరు పైన పార్టీ ముఖ్యులు ఢిల్లీలో అధినాయకత్వంతో ఇప్పటికే చర్చించినట్లు తెలుస్తోంది. హైకమాండ్ దిశా నిర్దేశం షర్మిల ఏదైనా కార్యక్రమం పార్టీ తరపున ఖరారు చేస్తే కనీస స్పందన ఉండటం లేదనే వాదన వినిపిస్తోంది. పార్టీ నిరసనలకు కార్యకర్తలకు కూడా సమాచారం అందటం లేదని చెబుతున్నారు. తాజాగా ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ కూడా షర్మిలను టార్గెట్ చేశారు. పార్టీలో అందరిని కలుపుకుపోకపోతే.. కాంగ్రెస్ పార్టీకి మరిన్ని కష్టాలు తప్పవని హెచ్చరించారు. కూటమి పార్టీలు చేరికలకు ఆహ్వానం పలుకుతున్నాయి. అటు వైసీపీ ఎన్నికల్లో ఓడిన తరువాత ప్రస్తుతం సమస్యల్లో కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఇది సరైన సమయం అయినప్పటికీ, షర్మిల మాత్రం పార్టీ బలోపేతం పైన ఫోకస్ చేయటం లేదనే అభిప్రాయం ఉంది. దీంతో, ఇప్పుడు రష్మిలకు పార్టీ నాయకత్వం ఎలాంటి మార్గ నిర్దేశం చేస్తుందనేది చూడాల్సి ఉంది.

తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యం

(1వపేజీ తరువాయి)ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.

తెలంగాణలో ఆర్థిక సంక్షోభం రాబోతుందంటూ కేంద్రమంత్రి హెచ్చరిక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో ఆర్థిక సంక్షోభం నెలకొనే ప్రమాదం పొంచి ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది అవుతున్నా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సరూర్ నగర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజావ్యతిరేక పాలన అని, దీనిని నిరసిస్తూ 6 అబద్ధాలు, 66 మోసాలు పేరుతో బీజేపీ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో హామీలు అమలు చేసే పరిస్థితి కూడా లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రుణమాఫీ, మహిళలకు తులం బంగారం, నిరుద్యోగ భృతి తదితర ఏ హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు కనీసం వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థికస్థితి ఉందన్నారు.

కేసీఆర్ కలిసి వస్తే.. దిల్లీలో ధర్నా చేద్దాం

(1వపేజీ తరువాయి)చెయ్యండి!" రాష్ట్రానికి నిధులు తెచ్చుడో, సచ్చుడో తేల్చుకుందామని రేవంత్ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుకు సవాల్ విసిరారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని తామెప్పుడూ పదే పదే చెప్పలేదన్నారు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదని హరీశ్ రావు పై పరోక్ష విమర్శలు చేశారు. అగ్గిపెట్టి మర్చిపో యినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని కేంద్రం కాపాడాలని రేవంత్ కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్దాల పాటు సమాఖ్య స్ఫూర్తిని కాపాడిందని, అన్ని రాష్ట్రాల్లో భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిందని చెప్పుకొచ్చారు. భాక్రానంగల్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా చేసి దేశాన్ని పరిపుష్టం చేసిందని, భారత్ ఆర్థికంగా నిలదొక్కుకుందని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి రాష్

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | ఆదివారం | 08 | డిసెంబర్ | 2024



యాక్షన్ మూవీని తలపించేలా చేజింగ్.. ఫైటింగ్

నల్గొండ-నవభూమి: సాధారణంగా సినిమాలల్లో దొంగలను పట్టుకునే సీన్లను వెరైటీగా చిత్రీకరిస్తుంటారు దర్శకులు. డబ్బులు, వాహనాల చోరీ ఇలా ఏదైనా దొంగతనానికి సంబంధించిన సీన్లను దర్శకులు ఎంతో హైలెట్‌గా తీస్తుంటారు. దొంగలను పట్టుకోవడం కోసం పోలీసులు చేసే చేజింగ్‌లు... ఫైటింగ్ సీన్లు ప్రేక్షకులను ఉత్కంఠ రేపుతుంటాయి. ఇది సినిమా కాబట్టి ప్రేక్షకులు ఎంతో ఇష్టంగా చూస్తుంటారు. కానీ రియల్‌గా కూడా కొందరు దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతుంటారు.వారిని చేజింగ్ చేసి అవసరమైతే ఫైటింగ్ కూడా చేస్తుంటారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు చేస్తే ధైర్యసాహసాలు హైలెట్‌గా నిలుస్తుంటాయి. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో చోటు చేసుకుంది. దొండగుడిని పట్టుకునేందుకు మూవీ రేంజ్‌లో చేజింగ్, ఫైటింగ్ చేశారు పోలీసులు. ఈక్రమంలో ఓ పోలీసు ప్రాణాలపోయే పరిస్థితికి తీసుకొచ్చాడు ఆ దొంగ. ఇంతకీ

ఏం జరిగింది... దొంగను పోలీసులు ఎలా పట్టుకున్నారు. గాయపడ్డ పోలీసు పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం.

నల్గొండ జిల్లాలో హైదరాబాద్ - విజయవాడ 65వ జాతీయ రహదారిపై జరిగిన చేజింగ్,ఫైటింగ్ యాక్షన్ మూవీని తలపించింది. ఓ దొంగ హయత్‌నగర్‌లో అంబులెన్స్ వాహనాన్ని చోరీ చేశాడు. ఆపై ఆ వాహనాన్ని తీసుకుని విజయవాడ వైపు పారిపోయేందుకు యత్నించాడు. విషయం తెలిసిన పోలీసులు వెంటనే అలర్ట్ అయి.. దొంగను పట్టుకునేందుకు హైవేపై కాపుకాశారు. అయితే హయత్‌నగర్ నుంచి సూర్యాపేట దాకా పోలీసులను సదరు దొంగ ముప్పు తిప్పలు పెట్టాడు. అంబులెన్స్ సైరన్‌తో రయ్ రయ్ మంటూ అతి వేగంతో దొంగ ప్రయాణం చేశాడు.

ముంబైలో పేలుళ్లకు ప్లాన్ అంటూ మెసేజ్.. అప్రమత్తమైన పోలీసులు

న్యూఢిల్లీ-నవభూమి: దేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరానికి బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. నగరంలో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు ముంబై ట్రాఫిక్ పోలీసు కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు మెసేజ్ వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో ఈ బెదిరింపు మెసేజ్ వచ్చింది. ముంబైతోపాటు జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ కు కూడా బెదిరింపులు వచ్చాయి. బెదిరింపు మెసేజ్‌తో అప్రమత్తమైన ముంబై పోలీసులు మొబైల్ నంబర్ ఆధారంగా మెసేజ్ పంపిన వ్యక్తిని ట్రేస్ చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ఎంవీఏకు షాక్.. కూటమి నుంచి వైదొలగిన సమాజ్‌వాదీ పార్టీ

న్యూఢిల్లీ-నవభూమి: మహారాష్ట్రలో ప్రతిపక్షమైన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమికి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) షాక్ ఇచ్చింది. ఆ కూటమి నుంచి వైదొలగాలని నిర్ణయించింది. ఎస్పీ ఎమ్మెల్యే అబూ అజ్మీ శనివారం ఈ విషయాన్ని ప్రకటించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ) ఓడిన తర్వాత 'హిందుత్వ ఎజెండా'ను అవలంబించిందని ఆయన ఆరోపించారు.కాగా, సీట్ షేరింగ్ సమయంలో, ఆ తర్వాత ప్రచారంలో కూడా ఎంవీఏలో సమన్వయం లేదని మహారాష్ట్ర ఎస్పీ అధ్యక్షుడైన అబూ అజ్మీ విమర్శించారు. 'అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అంతర్గత సమావేశంలో హిందుత్వ ఎజెండాను దూకుడుగా కొనసాగించాలని తన నాయకులు, పార్టీ కార్యకర్తలకు చెప్పారు. డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేతకు అనుకూలంగా ఆ పార్టీ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేసింది. దీన్ని మేం సహించబోం. కాబట్టి ఎంవీఏతో కొనసాగకూడదని నిర్ణయించుకున్నాం' అని అన్నారు.మరోవైపు మహారాష్ట్ర అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎంవీఏ బహిష్కరించింది. అయితే ఎస్పీ ఎమ్మెల్యేలు అబూ అసిమ్ అజ్మీ, రైస్ షేక్ ఈ పిలుపును ధిక్కరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు.

మేము కోరుకుంటున్నదీ అదే.. త్వరలోనే కలిసి మాట్లాడుతాం : దీదీ ప్రకటనపై సంజయ్ రౌత్

న్యూఢిల్లీ-నవభూమి: అవకాశం ఇస్తే ఇండియా కూటమి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీదీ ప్రకటనపై శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ తాజాగా స్పందించారు. తాము కోరుకుంటున్నది కూడా అదే అని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై మాట్లాడేందుకు త్వరలో కోల్‌కతా వెళ్లనున్నట్లు చెప్పారు.'మమతా జీ అభిప్రాయం మాకు తెలుసు. ఆమె భారత కూటమిలో ప్రధాన భాగస్వామి కావాలనే మేమూ కోరుకుంటున్నాం. దీదీ అయినా, అరవింద్ కేజ్రీవాల్ అయినా, శివసేన అయినా.. మేమంతా కలిసే ఉన్నాం. ఈ విషయంపై మమతా బెనర్జీతో మాట్లాడేందుకు మేము త్వరలో కోల్‌కతా వెళ్తాం' అని సంజయ్ రౌత్ విలేకరుల సమావేశంలో అన్నారు.

1400 మంది మలయాళీలు.. 700 కోట్లు కాజేశారు.. కేరళ నర్సులపై కేసు

కొచ్చి-నవభూమి: కేరళ నర్సులపై భారీ కేసులు నమోదు అయ్యాయి. కువైట్‌కు చెందిన గల్ఫ్ బ్యాంక్ నుంచి కోట్ల రుణం తీసుకుని ఉడాయించారు. సుమారు 1400 మంది మలయాళీలు.. దాదాపు 700 కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టినట్లు తెలుస్తోంది. సాలరీ సర్టిఫికేట్లను గ్యారెంటీగా పెట్టి .. గల్ఫ్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేరళలో దర్యాప్తు మొదలైంది.ఈ నేపథ్యంలో గల్ఫ్ బ్యాంక్‌కు చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ కేరళను విజిట్ చేశారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీపీకి ఆయన ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఇప్పటికే 10 కేసులు నమోదు చేశారు. ఎర్నాకుళం, కొట్టాయం జిల్లాల్లో ఆ కేసులు నమోదు అయ్యాయి. ఒక్కొక్క నర్సు సుమారు 50 లక్షల నుంచి 2 కోట్ల వరకు రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది.గల్ఫ్ బ్యాంక్ కువైట్ షేర్‌హోల్డింగ్ కంపెనీలో మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితుల్లో ఎక్కువ శాతం మంది నర్సులే ఉన్నట్లు తేలింది. డిఫాల్టర్ల వివరాలను పోలీసులకు బ్యాంకు వెల్లడించింది. ఆ వివరాల ఆధారంగా కేసులను రిజిస్టర్ చేస్తున్నారు. మూడు నెలల క్రితం బ్యాంకులో ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించారు. తొలుత చిన్న రుణాలను తీసుకుని.. వాటిని సకాలంలో చెల్లించేవారు. దీంతో బ్యాంకు నమ్మకాన్ని గెలుచుకునేవారు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో ఈ ఫ్రాడ్ జరిగింది.ఆ తర్వాత భారీ మొత్తంలో లోన్ తీసుకుని .. విదేశాలకు లేదా స్వంత దేశాలకు వెళ్లిపోతున్నట్లు బ్యాంక్ ఆరోపించింది. రుణం తీసుకున్న వారి లోకల్ అడ్రెస్సులు బ్యాంక్ వద్ద ఉన్నాయి. ఆ వివరాలను పోలీసులకు అందజేశారు. చాలా ప్లాన్ ప్రకారం ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు.. ఈ కేసులో దర్యాప్తు కోసం కేరళ పోలీసుల్ని ఆశ్రయించారు.

తెలంగాణలో మళ్లీ భూప్రకంపనలు... ఈసారి తీవ్రత ఎంతంటే..?



న్యూఢిల్లీ-నవభూమి: ఈ నెల 4న తెలంగాణలోని ములుగు జిల్లా కేంద్రంగా వచ్చిన భూకంపం.. హైదరాబాద్ తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైందని పరిశోధకులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం తెలంగాణలో మరోసారి భూమి కంపించింది. తెలంగాణలో మళ్లీ భూప్రకంపనలు వచ్చాయి. ఇందులో భాగంగా... మహబూబ్ నగర్ జిల్లాల్లో శనివారం మరోసారి భూమి కంపించింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఈ తాజా భూకంప తీవ్రత 3.0గా నమోదైనట్లు చెబుతున్నారు. జిల్లాలోని కౌకుంట్ల మండలం, దాసరిపల్లి సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారని అంటున్నారు. కాగా.. ఈ నెల 4న ములుగు జిల్లాలోని మేడారానికి ఉత్తర దిశలో భూమి లోపల సుమారు 40 కిలో మీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని చెబుతుండగా.. తీవ్రత 5.3గా నమోదైన ఈ భూకంపం ప్రభావంతో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, హన్మకొండ, భద్రాచలం తో పాటు ఏపీలోని పలు ప్రాంతల్లో భూమి కంపించిన సంగతి తెలిసిందే. దీంతో... భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. దీనిపై స్పందించిన శాస్త్రవేత్తలు.. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూమి పొరల మధ్య తేడాలు ఏర్పడతాయని.. అందుకే పలుమార్లు సర్దుబాటు కారణంగా భూకంపాలు సంభవిస్తాయని తెలిపారు. ఈ క్రమంలో దానికి కొనసాగింపుగా మరికొన్ని స్వల్ప భూకంపాలు వస్తాయని అన్నారు. ఇదే సమయంలో... ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రానికి చుట్టూ 232 కిలోమీటర్ల పరిధిలో భూప్రకంపనలు వచ్చినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆ సమయంలో తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర ల్లోనూ భూమి కంపించినట్లు కథనాలొచ్చాయి! అయితే... 5.0 కంటే అధికంగా దక్షిణ భారత దేశంలో భూమి కంపించడం ఇదే తొలిసారని అంటున్నారు!

వధువు మిస్సింగ్, కనిపించని పెళ్లి ఏర్పాట్లు.. వరుడు షాక్

చండీగఢ్ -నవభూమి: పెళ్లికి ముందు వధువు మాయమైంది. పెళ్లి ఏర్పాట్లు కూడా ఎక్కడా కనిపించలేదు. దీంతో కుటుంబం, బంధువులతో కలిసి ఊరేగింపుగా చేరుకున్న వరుడు షాక్ అయ్యాడు. వధువు హ్యాండ్ ఇచ్చినట్లు తెలుసుకున్న అతడు చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పంజాబ్‌లోని మోగాలో ఈ సంఘటన జరిగింది. జలంధర్‌లోని మాండియాలీ గ్రామానికి చెందిన 24 ఏళ్ల దీపక్ కుమార్ దుబాయ్‌లో పని చేస్తున్నాడు. మోగాకు చెందిన మన్‌ప్రీత్ కౌర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అతడికి పరిచయమైంది. సోషల్ మీడియా ద్వారా మూడేళ్లుగా మాట్లాడుకున్న వీరిద్దరూ ఎప్పుడూ కూడా కలుసుకోలేదు. అయితే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించారు.

కాగా, దీపక్ కుమార్ నెల రోజుల కిందట దుబాయ్ నుంచి సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. మన్‌ప్రీత్ కౌర్, ఆమె కుటుంబంతో అతడి తండ్రి ప్రేమ్ చంద్ మాట్లాడి పెళ్లి ఫిక్స్ చేశాడు. దీంతో పెళ్లి కోసం తన కుటుంబం, బంధువులు, స్నేహితులైన సుమారు 150 మంది పరివారంతో ఊరేగింపుగా దీపక్ కుమార్ శుక్రవారం మోగాకు చేరుకున్నాడు. అయితే వివాహ వేదిక వద్దకు తీసుకెళ్లేందుకు తమ వారిని పంపిస్తామని చెప్పిన వధువు, ఆమె కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయారు. **వారి ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి.**

మరోవైపు మోగాకు చేరుకున్న పెళ్లి బృందం పలు గంటలు ఎదురు చూసింది. వధువు కుటుంబం పేర్కొన్న పెళ్లి వేదిక 'రోజ్ గార్డెన్ ప్యాలెస్' గురించి స్థానికులను ఆరా తీశారు. మోగాలో ఆ పేరుతో ఎలాంటి ఫంక్షన్ హాల్ లేదని తెలుసుకుని షాక్ అయ్యారు. దీంతో దీపక్ కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. పెళ్లి ఖర్చుల కోసం రూ.50,000 కూడా మన్‌ప్రీత్ కౌర్‌కు పంపినట్లు ఆరోపించాడు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌ను షూట్ చేసిన విద్యార్థి.. మధ్యప్రదేశ్‌లో ఘటన



చాతార్‌పూర్-నవభూమి: మధ్యప్రదేశ్‌లోని చాతార్ పూర్‌లో దారుణ ఘటన జరిగింది. 12వ తరగతి చదువుతున్న విద్యార్థి.. స్కూల్ ప్రిన్సిపాల్‌పై కాల్పులు జరిపాడు. స్కూల్‌కు ఆలస్యంగా వచ్చినందుకు ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్ మందలించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ విద్యార్థి తన వద్ద ఉన్న గన్‌తో ఫైర్ చేసినట్లు తెలుస్తోంది. హత్య చేసిన ఆ స్టూడెంట్.. ప్రిన్సిపాల్ స్కూటర్‌పై పరారీ అయ్యాడు. కానీ అతన్ని తర్వాత పట్టుకున్నారు.

కింగ్‌ఫిషర్ టవర్స్‌లో కోట్లు ఖరీదైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన ఇన్ఫీ నారాయణమూర్తి



బెంగుళూరు-నవభూమి: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్ ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరు లోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్ లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం.నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇళ్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా- ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

ఏక్‌నాథ్ షిండే హోంశాఖ కోరుకుంటున్నారు : శివసేన ఎమ్మెల్యే

న్యూఢిల్లీ-నవభూమి: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే అజిత్ పవార్‌లు ప్రమాణం చేశారు. అయితే, మంత్రివర్గ కూర్పుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం మంత్రిత్వ శాఖల కేటాయింపుపై చర్చలు జరుగుతున్నాయి.ఈ నెల 11 లేదా 12 తేదీల్లో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కూటమి నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండే హోంశాఖ కోరుకుంటున్నట్లు ఆయన సన్నిహితుడు, శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవలే తెలిపారు. 'షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంతోపాటు హోం శాఖను కూడా నిర్వహించారు. అదేమాదిరి ఇప్పుడు షిండే కూడా హోంశాఖ అడిగారు. మంత్రిత్వ శాఖల కేటాయింపుపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. మరో రెండు లేదా మూడు రోజుల్లో పోర్ట్‌ఫోలియోలపై చర్చలు ముగుస్తాయని ఆశిస్తున్నాం' అని గోగవలే వ్యాఖ్యానించారు.

ఢిల్లీ వ్యాపారవేత్తను కాల్చి చంపిన దుండగులు

న్యూఢిల్లీ-నవభూమి: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇద్దరు వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఓ వ్యాపారవేత్త ప్రాణాలు కోల్పోయాడు . ఈ ఘటన షాహదారా జిల్లాలోని ఫార్న్ బజార్ ప్రాంతంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీల్ జైన్ (52) అనే వ్యక్తి యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో మార్నింగ్ వాక్‌కు వెళ్లాడు. వాకింగ్ పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిపై ఎనిమిది రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సునీల్ జైన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు దేశ రాజధానిలోని కృష్ణా నగర్ వాసిగా గుర్తించారు. అతనికి పాత్రల వ్యాపారం ఉందని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

తన వారసులెవరన్న దానిపై మమతా బెనర్జీ ఏమన్నారంటే

కోల్‌కతా-నవభూమి: తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, యువ నేతల మధ్య అంతర్యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో తన వారసులు ఎవరన్న దానిపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ క్లారిటీ ఇచ్చారు. పార్టీ నాయకత్వమే కలిసికట్టుగా తన వారసులపై నిర్ణయం తీసుకుంటుందని, వ్యక్తిగత నిర్ణయాలు ఉండవన్నారు. న్యూస్18 బంగ్లా ఛానెల్‌కు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె విషయాన్ని తెలిపారు. తృణమూల్ పార్టీలో ఏకఛత్రాధిపత్యం లేదన్నారు. నేనేమీ పార్టీని కాదు అని, మేం అందరం కలిస్తే పార్టీ అని, ఇది సంయుక్త కుటుంబం అని, నిర్ణయాలను కలిసి తీసుకుంటామని ఆమె తెలిపారు.మీ వారసులు ఎవరని జర్నలిస్టు వేసిన ప్రశ్నను దాటివేస్తూ.. టీఎంసీ క్రమశిక్షణ గల పార్టీ అని, ఇక్కడ ఏ ఒక్కరూ ఆదేశాలు ఇవ్వరన్నారు. ప్రజలకు ఏది మంచిదో అది పార్టీ నిర్ణయిస్తుందని, తమకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలు ఉన్నారని, కలిసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమే అని, ఇవాళ కొత్తగా వచ్చిన వారు రేపు సీనియర్ అవుతారన్నారు. పార్టీలో ఉన్న సీనియర్లు మమతా బెనర్జీకి క్లోజ్‌గా ఉన్నారు. ఇక ఆ పార్టీ జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీకి యువ నాయకులు దగ్గరగా ఉన్నారు. ఆ రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గంటకు 1,100 కిలోమీటర్ల వేగం!



న్యూఢిల్లీ-నవభూమి: భారతదేశ రవాణా వ్యవస్థలో సరికొత్త శకం మొదలుకాబోతున్నది. విమాన వేగంతో పోటీపడి ప్రయాణించే హైపర్‌లూప్ వ్యవస్థ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. చెన్నై సమీపంలో 410 మీటర్ల హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ పూర్తయ్యింది. ఇందుకు సంబంధించిన వీడియోను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఐఐటీ మద్రాస్, రైల్వే శాఖ కలిసి ఈ ట్రాక్‌ను నిర్మించాయి. అధునాతన హైపర్‌లూప్ సాంకేతికతను దేశంలో అభివృద్ధి చేసేందుకు ఐఐటీ మద్రాస్‌లో 'ఆవిష్కార్' పేరుతో 76 మంది విద్యార్థులతో కూడిన ప్రత్యేక బృందం, ఐఐటీ మద్రాస్‌లోనే స్థాపించిన 'టూటర్' అనే స్టార్టప్ పని చేస్తున్నాయి. టెస్ట్ ట్రాక్ పూర్తి కావడంతో ఈ సాంకేతికతను పరీక్షించడం కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

ముంబై -పుణె మధ్య మొదటి దశ

హైపర్‌లూప్ పాడ్‌లు మధ్యలో ఎలాంటి స్టాప్‌లు లేకుండా ఆరంభ స్టేషన్ నుంచి గమ్యస్థానానికి ప్రయాణిస్తాయి. అందుకే వీటిని ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్ట్‌గా ఏర్పాటుచేసేందుకు అంతర్జాతీయంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన దేశంలో ముంబై-పుణె కారిడార్‌లో మొదటి హైపర్‌లూప్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. రోడ్డు ప్రయాణానికి మూడు గంటలు పట్టే ఈ రెండు స్టేషన్ల మధ్య హైపర్‌లూప్‌లో 25 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఆ తర్వాత చెన్నై %-% బెంగళూరు, ఢిల్లీ - చండీగఢ్ మధ్య కూడా హైపర్‌లూప్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. పుణెకు చెందిన క్విన్‌ట్రాన్స్ హైపర్‌లూప్ అనే అంకుర సంస్థ కూడా హైపర్‌లూప్ కార్గో వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నది.

ఏమిటీ హైపర్‌లూప్ టెక్నాలజీ?

హైపర్‌లూప్ అనే హైస్పీడ్ రవాణా వ్యవస్థ ఆలోచన 2012లో మొదటిసారి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మదిలో పుట్టింది. తక్కువ పీడనం ఉండే ట్యూబ్(భారీ పైప్‌లైన్ లాంటిది)లో చిన్న పాడ్(రైలు బోగీ లాంటిది)ల ద్వారా ఈ ప్రయాణం కొనసాగుతుంది. ఒక్కో పాడ్‌లో 24 నుంచి 28 మంది ప్రయాణించవచ్చు. అయస్కాంతాలతో ఒత్తిడి కలిగించి, రాపిడి(ఫ్రిక్షన్) తగ్గించడం ద్వారా అత్యంత వేగంతో ఈ పాడ్‌లు ఒక చోట నుంచి మరో చోటకు ప్రయాణిస్తాయి. గంటకు 1,100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉండేలా హైపర్‌లూప్ వ్యవస్థను రూపొందిస్తారు. హైపర్‌లూప్ వ్యవస్థ ప్రయాణ వేగాన్ని గణనీయంగా పెంచడంతో పాటు ఇంధన అవసరాన్ని తగ్గిస్తుంది.

సిరియాలో దాడులు.. ట్రావెల్ అడ్వైజరీ జారీచేసిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ-నవభూమి: అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సిరియాలో మళ్లీ సంక్షోభం మొదలైంది. అధ్యక్షుడు బషర్-అల్-అసద్ గద్దె దిగాలంటూ తిరుగుబాటుదారులు భీకర దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో సిరియాలో ఉన్న భారతీయులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. అక్కడ ఉన్నవారంతా వెంటనే స్వదేశానికి వచ్చేయాలని సూచించింది. ఒకవేళ రాలేనివారు డమాస్కస్‌లోని భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని తెలిపింది. భద్రత గురించి జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించింది. అత్యవసర సహాయం కోసం o963993385973, %hoc.damascus@mea.gov.in%ను సంప్రదించాలని పేర్కొన్నది. ఈ మేరకు విదేశాంగ శాఖ ట్రావెల్ అడ్వైజరీ జారీచేసింది.

అదేవిధంగా ప్రభుత్వ తదుపరి నోటిఫికేషన్ జారీచేసే వరకు భారత పౌరులెవరూ సిరియా వెళ్లొద్దని ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే అక్కడ ఉంటే తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. వీలైన త్వరగా అందుబాటులో ఉన్న విమానాల్లో వచ్చేయాలని తెలిపింది.

ఈ బ్యాటరీ నిరంతరాయంగా 11 వేల ఏండ్లు పనిచేస్తుందట..!

హైదరాబాద్-నవభూమి: సాధారణ బ్యాటరీ లైఫ్ ఎంతకాలం ఉంటుంది? ఒకటి లేదా రెండేండ్లు. అయితే, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్, యూకే అటామిక్ ఎనర్జీ అథారిటీకి చెందిన పరిశోధక బృందం అభివృద్ధి చేసిన బ్యాటరీ ఏకంగా 11 వేల ఏండ్లకు పైగా నడుస్తుంది. దీన్ని 'డైమండ్ బ్యాటరీ'గా పిలుస్తున్నారు.

సోలార్ ప్యానెల్స్ సూర్యకాంతిని విద్యుత్తుగా మార్చినట్టే, కార్బన్-14 రేడియోయాక్టివ్ ఐసోటోప్ రేడియేషన్ సాయంతో విద్యుత్తును ఉత్పత్తి చేసే బ్యాటరీనే 'డైమండ్ బ్యాటరీ'గా పిలుస్తున్నారు. 'కార్బన్-14' నిరంతరాయంగా 11,400 ఏండ్లపాటు రేడియేషన్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే, డైమండ్ బ్యాటరీ కూడా అంతేకాలంపాటు విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని

శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ బ్యాటరీ వేసిన డివైజ్ 11,400 ఏండ్లపాటు నిరంతరాయంగా పనిచేయగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. వినియోగం ఎక్కడంటే?..హార్ట్ రేటును క్రమబద్ధీకరించే పేస్‌మేకర్లు బ్యాటరీ ఆధారంగానే పనిచేస్తాయి. బ్యాటరీలో పవర్ అడుగంటినప్పుడు వాటిని తరుచూ మార్చడం కష్టమౌతుంది. ఈ సందర్భాల్లో ఏండ్లపాటు నిరంతరాయంగా పనిచేసే డైమండ్ బ్యాటరీని వినియోగించవచ్చు. అంతేకాకుండా వినికిడి సమస్యలు ఉన్నవారు వాడే హియరింగ్ ఎయిడ్స్‌తో పాటు రోదసి ప్రయోగాల్లో స్పేస్‌క్రాఫ్ట్, శాటిలైట్స్ పనిచేయడానికి వాడే బ్యాటరీలు కూడా నిరంతరాయంగా పనిచేయాల్సి ఉంటుంది. వీటికి కూడా డైమండ్ బ్యాటరీ ఓ చక్కటి ప్రత్యామ్నాయమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

ఉద్యోగులకు హక్కులు

ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది అందరినీ అధికరణ 33 పరిధి లోకి తీసుకువచ్చేందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ప్రభుత్వోద్యోగిగా ఉద్యోగ భద్రతను కోరుకొంటున్న పక్షంలో వారు తమ ప్రాథమిక హక్కులను పరిత్యజించాలి.

నష్టాలను చవిచూస్తున్న ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్‌యు) ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టే ముందు, ఆ సంస్థ సిబ్బందిలో మూడో వంతు మందిని స్వచ్ఛంద ఉద్యోగవిరమణ పథకం కింద పంపించివేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసేవారికి భారీ ప్యాకేజీలు ఇవ్వవలసివుంటుంది. ఎయిర్ ఇండియాలో మొత్తం నలభై వేల మంది సిబ్బంది వున్నారు. ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా వున్నది. ప్రభుత్వ రంగ ఎరువుల ఫ్యాక్టరీ ఒకటి గత ఇరవై సంవత్సరాలుగా మూతపడివున్నది. అయితే, ఆ ఫ్యాక్టరీలో ఉద్యోగి అయిన నా సహపాఠి ఒకరు ఈ ఇరవై ఏళ్ళుగా నెలనెలా రంచన్‌గా వేతనభత్యాలు పొందుతూనే వున్నాడు! వేతన భత్యాల విషయంలో ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగానే పరిగణిస్తున్నారు. అయినా జవాబుదారీగా వుండడానికి పిఎస్‌యులు నిరాకరిస్తున్నాయి. పిఎస్‌యులకు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నదని, కనుక ప్రభుత్వ శాఖలలా పిఎస్‌యులు జవాబుదారీగా వుండవల్సిన అవసరంలేదని వాటి ఉద్యోగులు వాదిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి ఒకరు ఒక అంశంపై అధ్యయనం నిర్వహించమని ఒకసారి నన్ను కోరారు. దీనికి వివిధ ప్రభుత్వ శాఖల ఆమోదం పొందడం చాలా ఇబ్బందికరమయింది. దీంతో ఆ కార్యదర్శి ఒక పిఎస్‌యు మేనేజింగ్ డైరెక్టర్‌ను పిలిచి నాకు కాంట్రాక్టు ఇవ్వమని ఆదేశించారు. పిఎస్‌యు ఉద్యోగులను ప్రభుత్వోద్యోగులుగానైనా పరిగణించాలి లేదా ఒక వ్యాపార సంస్థ ఉద్యోగులుగానైనా పరిగణించాలి. ప్రభుత్వోద్యోగులుగా పరిగణిస్తే ఒక పిఎస్‌యు నుంచి ఏదైనా ఒక ప్రభుత్వ శాఖకు బదిలీ చేయడానికి అవకాశముంటుంది. అవసరాల కంటే ఎక్కువగా వున్న పిఎస్‌యు సిబ్బంది, ప్రభుత్వోద్యోగులను ఉమ్మడి ఉద్యోగులుగా పరిగణించేందుకు ఒక చట్టాన్ని తీసుకురావాలి. అప్పుడు ఏదైనా ఇతర ప్రభుత్వరంగ సంస్థ లేదా ప్రభుత్వ శాఖ వారిని తమ తమ విభాగాలలోకి తీసుకోవచ్చు. ప్రభుత్వోద్యోగులుగా కాకుండా ఒక వ్యాపారసంస్థ ఉద్యోగులుగా పరిగణించిన పక్షంలో ఎయిర్ ఇండియా సిబ్బందికి లాభదాయక విఆర్ఎస్ ఇచ్చే బదులు వారిని తొలగించే ఆస్కారముంటుంది. ప్రభుత్వోద్యోగులతో సమస్య మరింత క్లిష్టమైనది. ప్రజలకు 'సేవ' చేసేందుకు వారిని నియమిస్తున్నారు. అయితే దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సరే బంగారు ఆభరణాల వర్తకులను అడగండి. తాము విక్రయించే ఆభరణాలు, బంగారాన్ని అత్యధికంగా కొంటున్నది ప్రభుత్వోగులేనని తప్పకుండా సమాధానమిస్తారు. ప్రభుత్వోద్యోగులు బంగారాన్ని కొనడానికి గతంలో పాత కరెన్సీ నోట్లతో వచ్చేవారని, ఇప్పుడు కొత్త కరెన్సీ నోట్లతో వస్తున్నారని ఒక వర్తకుడు నాతో అన్నాడు. అతని వ్యాపారం గతంలోవలే వర్ధిల్లుతోంది. ప్రజలకు సేవలు చేయడానికి నియమితులైనవారు వారి దోపిడీదారులుగా రూపొందుతున్నారు! పైపెచ్చు ఉద్యోగులుగా తమకు కొన్ని ప్రాథమిక హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడాలని ప్రభుత్వోద్యోగులు వాదిస్తారు. వేతన భత్యాలు, బదిలీలు, పదోన్నతుల విషయంలో న్యాయం చేయాలని ప్రభుత్వోద్యోగులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారు. దేశవ్యాప్తంగా ఈ వ్యాజ్యాలు సదా వేల సంఖ్యలో ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వోద్యోగులకు లభించే ఉద్యోగ భద్రత మొదలైన ప్రయోజనాలు కచ్చితంగా తమకు లభించేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అని సర్కారు సిబ్బంది అంటారు. అదే సమయంలో సామన్య పౌరునికి వుండే ప్రాథమిక హక్కులు తమకు కూడా తప్పకుండా వుండాలని డిమాండ్ చేస్తున్నారు. సైనిక దళాల విషయంలో పరిస్థితి భిన్నమైనది. రక్షణ శాఖ సిబ్బందికి ప్రాథమిక హక్కులు లేకుండా చేసే చట్టాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగంలోని అధికరణ 33 అధికారమిచ్చింది ('రక్షణ దళాలకూ, శాంతిభద్రతల రక్షణకూ వినియోగింపబడే దళాలకూ, గూఢచారిదళాలకూ, ఈ మూడు దళాలకూ ఉపయుక్తమైన టెలీకమ్యూనికేషన్‌లో పనిచేసే వారికి విధి నిర్వహణ, క్రమశిక్షణ దృష్ట్యా ప్రాథమిక హక్కులు ఎంత మేరకు వర్తించునో అను విషయాలపై పార్లమెంటుకు చట్టాన్ని చేసే అధికారం వున్నది. ఈ అధికారం క్రింద పార్లమెంటు చేయు చట్టం రక్షణ దళాల విషయంలో ప్రాథమిక హక్కుల అనుభవాన్ని పరిమితం చేయవచ్చు, ఉపసంహరించవచ్చు' అని అధికరణ పేర్కొంది). ఈ కారణంగా ప్రమోషన్లు మొదలైన విషయాలలో సైనికోద్యోగులు ఉన్నతన్యాయస్థానాలను ఆశ్రయించడం రాజ్యాంగ విరుద్ధం. పిఎస్‌యు ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది అందరినీ అధికరణ 33 పరిధిలోకి తీసుకువచ్చేందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ప్రభుత్వోద్యోగిగా ఉద్యోగ భద్రతను కోరుకొంటున్న పక్షంలో వారు తమ ప్రాథమిక హక్కులను పరిత్యజించాలి.

కమ్యూనిస్టుకు ప్రతిరూపం పోటు ప్రసాద్

తుమ్మలపల్లి ప్రసాద్

నేడు ఖమ్మంలో సంతాప సభ

త్యాగాలకు ముందు వరుసలో స్వార్థానికి చివరి వరుసలో కనిపించే నికార్సయిన ఆదర్శ కమ్యూనిస్టు పోటు ప్రసాద్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి ముఖ్యంగా సిపిఐ పార్టీకి తీరని లోటు. పుడితే కమ్యూనిస్టుగా పుట్టాలి! తన మరణం కూడా కమ్యూనిస్టుగానే ఉండాలి!! అప్పుడే ప్రజల్లో అమరజీవిగా వందల సంవత్సరాలు బ్రతికే ఉంటారు. ఆ అమరత్వం అనేది ప్రజల్లో కమ్యూనిస్టు నిర్మాణ కార్యకలాపాల్లో ఉండగా జరిగితే తన జన్మ ధన్యం అవుతుంది. పుట్టిన ప్రతి మనిషి ఏదో ఒక రోజు గిట్టక తప్పదు. అది వృద్ధాప్యం దరిచేరిన తర్వాత జరిగితే గత స్మృతులను గుర్తు చేసుకుంటూ ఘనంగా వీడ్కోలు పలకవచ్చు. అలా కాకుండా నానమ్మ, తాతయ్య, తండ్రి నుండి వారసత్వంగా కమ్యూనిస్టు ఓనమాలను పుణికిపుచ్చుకుని, వారి బాటలో ప్రయాణిస్తూ, ఒక నాయకుడిగా రాణిస్తున్న సమయంలో అర్థాంతరంగా తనువు చాలిస్తే కుటుంబ సభ్యులు, బంధు మిత్రులే కాదు, ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడిగా పనిచేస్తున్నందుకు బడుగు బలహీన వర్గాలకు తీరని దుఃఖాన్ని కలిగిస్తుంది. తన పార్టీకి, పార్టీ కార్యకర్తలకు పూడ్చ లేని లోటు ఏర్పడుతుంది. నేడు అదే జరిగింది ఖమ్మం జిల్లాలో పోటు ప్రసాద్ మరణం. రెండో దఫా సిపిఐ పార్టీకి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ నవంబర్ 27న గుండె పోటుతో పోటు ప్రసాద్ (63) మరణం తీవ్ర విషాదం అనే చెప్పవచ్చు. ఇంకో పది పదిహేను సంవత్సరాల పాటు కమ్యూనిస్టు నాయకుడిగా బడుగు జీవుల కోసం పనిచేసే అవకాశం ఉండగా అర్థాంతరంగా గుండె పోటుతో మరణించడం విషాదం కాక మరేమవుతుంది. తన అక్క పోటు కళావతి సిపిఐ పార్టీ అనుబంధ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా, పార్టీ కి జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నా కూడా తన తమ్ముడు ప్రసాద్ ను ఏనాడు తమ్ముడుగా చూడలేదు. ఒక కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగానే చూసిందంటే వారిరువురూ తాము నమ్మిన సిద్ధాంతం పట్ల ఎంత నిబద్ధతతో పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి నల్గొండ జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో 1960 లో పోటు రాఘవయ్య - రాంబాయమ్మ దంపతులకు జన్మించిన ప్రసాద్ తన డిగ్రీ చదువు ఖమ్మంలోని ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కళాశాలలో కొనసాగింది. తాను చదువుకుంటున్నప్పుడు కానీ, ఆ తర్వాత కూడా తన జీవితం మొత్తం కమ్యూనిస్టు గానే కొనసాగింది. పోటు ప్రసాద్ నాయనమ్మ పోటు ఎర్రమ్మ కూడా ఉమ్మడి నల్గొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కాకలు తీరిన మహిళగా ఖ్యాతి గడించారు. ఆంధ్ర రాష్ట్ర ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పుస్తకాల్లో సైతం ఆమె ఫోటో తో ఒక పేజీ కెటాయించారంటేనే అర్థం చేసుకోవచ్చు. తండ్రి రాఘవయ్య సైతం సాయుధ పోరాట కాలం నుండి కమ్యూనిస్టు ఉద్యమంలోనూ తన పోరాట పటిమను ప్రదర్శించారు. నాయనమ్మ ఎర్రమ్మ నుండి తండ్రి రాఘవయ్య, రాఘవయ్య నుండి కొడుకు ప్రసాద్ వారసత్వంగా తమ పోరాట పటిమను ప్రదర్శించారు. ప్రసాద్ తోబుట్టువులు నలుగురు అక్కా చెల్లెళ్ళు, ముగ్గురు అన్నదమ్ములు అందరూ కూడా ఏదో ఒక స్థాయిలో ఎర్రజెండా వెలుగులోనే ఉండటం విశేషంగా చెప్పుకోవచ్చు. అవినీతి మచ్చ లేని మహా నాయకుడిగా పేరు గడించిన ప్రసాద్ మరణం సిపిఐ పార్టీ కి తీరని లోటని చెప్పవచ్చు. కరుడుగట్టిన మరో కమ్యూనిస్టు, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం పోటు ప్రసాద్ మరణ వార్త జీర్ణించుకోలేక పోయారు. ప్రసాద్ పార్థివ దేహాన్ని చూసి కూనంనేని బోరున విలపించారంటేనే అర్థం చేసుకోవచ్చు ప్రసాద్ లాంటి కమిట్మెంట్ నాయకుడిని కోల్పోయిన బాధ. నలుగురు అక్కా చెల్లెళ్ళకు ప్రసాద్ తో ఆప్యాయతతో కూడిన తండ్రి లాంటి అనుబంధం ఉంది. నిర్జీవంగా ఉన్న తన అన్నను చూసి వారిలో పొంగి వస్తున్న దుఃఖానికి ఆనాడు ఎందరినో కంటతడి పెట్టించింది. ప్రసాద్ పార్థివ దేహాన్ని సైతం వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఖమ్మం మమత వైద్య కళాశాలకు అందజేసిన

కుటుంబ సభ్యులు ప్రసాద్ బ్రతికి ఉన్నప్పుడే కాదు తాను మరణించిన తర్వాత కూడా పలువురికి ఉపయోగపడటం విశేషం. అంత్యక్రియల రోజున బంధువులందరూ ఎర్రని దుస్తులు ధరించి ఘనంగా వీడ్కోలు పలకడం అంటేనే అర్థం చేసుకోవచ్చు ప్రసాద్ కుటుంబ ఆదర్శాన్ని. ఖమ్మంలో పోటు ప్రసాద్, బాగం హేమంతరావు, కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాషాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ పార్టీకి నాలుగు స్థంభాల్లా ఉండేవారు. ఒక స్థంభం లేని బాధ ఆ ముగ్గురిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అయినా పోటు ప్రసాద్ ఆశయాలను కొనసాగింపులో భాగంగా నేడు ఆదివారం ఖమ్మంలో ఆయన సంతాప సభను ఘనంగా నిర్వహిస్తున్నారు.

-తుమ్మలపల్లి ప్రసాద్
స్టేట్ బ్యూరో చీఫ్
నవభూమి దినపత్రిక
సెల్: 9912010030

రాజ్యాంగ విలువలకు పట్టంగట్టిన తీర్పు!

దేశంలో 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భాన భారత రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) అంతర్భాగమని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో ఈ సూత్రాలు ఉండటాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బల్‌రాం సింగ్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేయడం విశేషం. ఈ పిటిషన్‌దారుల్లో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యన్‌స్వామి కూడా ఒకరు కావడం గమనార్హం. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలు, విలువలను తెలియజేస్తున్నది. అంతేకాదు, భారతదేశపు ప్రజాస్వామ్య, భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళితత్వాన్ని రూపొందించడంలో వాటి ప్రాధాన్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్తున్నది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలను చేర్చారు. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మక ఘటన. మన దేశం రాజకీయ, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ సూత్రాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కట్టుబడి ఉన్న ఆదర్శాలకు, నిబద్ధతలకు ప్రతీకలు. ఈ సూత్రాలు రాజ్యాంగ పీఠికలో చేర్పులు మాత్రమే కాదు, భారతీయ నైతిక విలువలు, రాజకీయపరమైన చర్చల్లో లోతుగా పాతుకుపోయిన విలువలకు అధికారిక ఆమోద ముద్ర అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ పీఠికతో సహా రాజ్యాంగాన్ని సవరించే హక్కు నిస్సందేహంగా పార్లమెంట్‌కు ఉన్నదని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. అయితే, ఈ సూత్రాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించాయని లేదా అసలు ఉద్దేశాన్ని అవి వక్రీకరించాయనే వాదనను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. అంతేకాదు, ఆర్టికల్స్ 14, 15, 16, 25-30 సమానత్వం, వివక్ష లేకపోవడాన్ని, మత స్వేచ్ఛను కల్పిస్తున్నట్టే లౌకికవాదం అనేది అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని న్యాయస్థానం నొక్కిచెప్పింది. అలాగే దేశంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను అనుమతించడం ద్వారా మిశ్రమ ఆర్థిక నమూనాతో సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల దేశం నిబద్ధతను సామ్యవాదం ప్రతిబింబిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై తలెత్తుతున్న ఆందోళనలను కూడా సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఆ తర్వాత 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఈ సూత్రాలను పునరుద్ఘాటించినట్టు న్యాయస్థానం గుర్తుచేసింది. సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలు భారత రాజ్యాంగ నైతిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయనీ, అవి భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని కోర్టు చెప్పింది. 'మనమంతా భారతీయ ప్రజలం' అనే ఆకాంక్షలను ప్రతిబింబించేలా పీఠికను సజీవ సాక్ష్యంగా న్యాయవ్యవస్థ గుర్తించిందని చెప్పడానికి ఈ తీర్పు తార్కాణం. భారత రాజకీయ, ఆర్థిక, విధానరమైన నిర్ణయాలు, చర్చల్లో సామ్యవాదం కీలకపాత్ర పోషిస్తున్నది. ఈ సూత్రాన్ని మన దేశం అవలంబించిన నాటి నుంచి సమకాలీన సంక్షేమ విధానాల అమలులో సామ్యవాదం మార్గనిర్దేశక శక్తిగా ఉన్నది. ముఖ్యంగా 1980లో బొంబాయి వేదికగా బీజేపీని స్థాపించినప్పుడు ఆ పార్టీ గాంధేయ సోషలిజాన్ని తమ వ్యవస్థాపక సూత్రాల్లో ఒకటిగా స్వీకరించింది. గాంధేయ సోషలిజం బీజేపీ సైద్ధాంతిక మూలస్తంభమని ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అటల్ బిహారీ వాజపేయి విస్పష్టంగా ప్రకటించారు. సోషలిజం రాజకీయాలకతీతమని, భారత పాలనలో ఏకీకృత ఆదర్శంగా ఇది మిగిలిపోతుందని చెప్పడానికి ఇది నిదర్శనం. 1990వ దశకంలో ఆర్థిక సరళీకరణలు, సంస్కరణలు వచ్చినప్పటికీ, దేశంలోని అనేక రాజకీయ పార్టీలు సోషలిస్టు ఆదర్శాలకు కట్టుబడి ఉన్నాయి. సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీయూ, జేడీఎస్ వంటి ప్రాంతీయ అస్తిత్వ శక్తులు సోషలిజం పట్ల తమ నిబద్ధతను చాటుకున్నాయి. అంతేకాదు, సోషలిస్టు సూత్రాల ప్రకారం.. ఆయా పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ సంక్షేమ విధానాలను రూపొందించి, అమలు చేశాయి కూడా.

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గతంలో నక్సలైట్లను దేశభక్తులుగా అభివర్ణించారు. సోషలిజం ప్రభావానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. సంప్రదాయేతర నెరేటివ్స్‌లోనూ సోషలిజం సూక్ష్మ, విస్తృత ప్రభావానికి ఇది నిదర్శనం. ఈ సైద్ధాంతిక నిబద్ధత మన దేశంలో సంక్షేమ నమూనాకు కూడా విస్తరించింది. వనరులు, అవకాశాల సమాన పంపిణీకి ఇది ప్రాధాన్యమిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, పీఎం కిసాన్ యోజన, మహారాష్ట్రలో అమలవుతున్న లడ్కీ బహీన్ యోజన వంటి పథకాలు సోషలిజానికి ఆధునిక మేనిఫెస్టోలాంటివి. అసమానత్వాన్ని రూపుమాపేందుకు, సామాజిక న్యాయం చేసేందుకు సామ్యవాదమే పరిష్కార మార్గం. ఎవరూ ఔనన్నా, కాదన్నా భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యతలతో కూడిన భారత్‌కు లౌకికవాద దేశమనే గుర్తింపు అనివార్యం. 2011 జనాభా లెక్కలే అందుకు నిదర్శనం. 2011 జనగణన ప్రకారం%-% దేశంలో 79.8 శాతం హిందువులు, 12 శాతం ముస్లింలు, 2.3 శాతం క్రైస్తవులు, 1.7 శాతం సిక్కులు, 0.7 శాతం బౌద్ధులు, 0.4 శాతం జైనులు, మిగిలిన శాతం ఇతరుల మతాలను ఆచరించేవారున్నారు. ఈ మతపరమైన బహుళత్వం 22 అధికారిక భాషలు, వందలాది మాండలికాలతో కలిపి దేశంలో సంపూర్ణంగా విస్తరించి ఉన్నది. ఇలాంటి వైవిధ్య సమాజంలో లౌకికవాదం అందరినీ ఏకం చేసే సూత్రంగా పనిచేస్తుంది. తమ విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే వ్యక్తుల హక్కులను కాపాడుతూ, దేశం అన్ని మతాలను గౌరవిస్తుందని ఇది తెలియజేస్తుంది. సామరస్యాన్ని, సమానత్వాన్ని పెంపొందించే ప్రత్యక్ష వాస్తవికతే లౌకికవాదం. విభిన్న పండుగలను కలిపి జరుపుకోవడం నుంచి పాలనలో వివిధ వర్గాల ప్రాతినిధ్యం వరకు లౌకికవాదం భారతదేశ నైతికతలో లోతుగా పాతుకుపోయింది. అయితే, మన దేశంలో లౌకికవాదం భవిష్యత్తులోనూ పరిఢవిల్లాలంటే అప్రమత్తత అవసరం. దేశంలో అక్కడక్కడ జరిగే మత విభేదాల ఘటనలు ఈ ఆదర్శ సూత్రాన్ని సవాలు చేస్తాయి. లౌకికవాదం మరింత కాలం మనుగడ సాగేందుకు పౌరసంస్థలు, రాజకీయ నాయకులు ప్రయత్నించాలి. సుప్రీంకోర్టు లౌకికవాదాన్ని పునరుద్ఘాటించడం, భిన్నత్వం మధ్య భారతదేశం ఏకత్వాన్ని కాపాడటంలో దాని పాత్రను గుర్తు చేస్తుంది. సామ్యవాదం, లౌకికవాదం అనేవి కేవలం సాధారణ పదాలు కావని, అవి భారత రాజ్యాంగానికి ఆధారమైన ప్రాథమిక సూత్రాలని సుప్రీంకోర్టు తీర్పు తెలియజేస్తున్నది. బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామితో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ%-% ఈ విలువలు రాజ్యాంగ మౌలిక సూత్రాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి నకళ్ల వంటివని, అవి వాటితో సరిగ్గా సరిపోతాయని న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఈ తీర్పు రాజ్యాంగ అనుకూలతను కూడా తెలియజేస్తున్నది.

భక్తి

తిలతర్పణపురి నరముఖ గణపతి

'త్రొండము నేకదంతమును...' అని ఆ ఆలయంలో గణేశుణ్ణి ప్రార్థించాలంటే కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే అక్కడ గణపతి తొండం, దంతం లేకుండా... నరముఖంతో దర్శనమిస్తాడు. ఈ ఆలయం తమిళనాడులోని పూన్‌తోట్టమ్ సమీపంలోని తిలతర్పణపురిలో (ప్రస్తుతం శీతలపతి గ్రామంలో) ఉంది. గణపతి గజముఖుడిగా కాకుండా... మానవ ముఖంతో కనిపించే ఆలయం ఇదొక్కటేనంటారు. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన కథను స్థలపురాణం చెబుతోంది. నలుగుపిండితో పార్వతీదేవి ఒక బొమ్మను తయారు చేసి, దానికి ప్రాణం పోసింది. ద్వారానికి ఆ బాలుణ్ణి కాపలాగా పెట్టి స్నానానికి వెళ్ళింది. అంతలో శివుడు అక్కడికి వచ్చాడు. ఆయనను లోపలికి వెళ్ళకుండా ఆ బాలుడు అడ్డుకున్నాడు. దాంతో శివుడు ఆగ్రహించి... ఆ బాలుడి తలను ఖండించాడు. తరువాత పార్వతీ దేవి ద్వారా ఆ బాలుడి గురించి తెలుసుకొని... ఏనుగు శిరస్సును ఆ బాలుడి తలకు అతికించాడు. ఆ గజాననుడు తదనంతరం గణాధిపతి అయ్యాడు. తదనంతర కాలంలో... మునుల కోరిక మేరకు తిలతర్పణపురిలో ముక్తీశ్వరుడిగా శివుడు, స్వర్ణవల్లిగా పార్వతీదేవి కొలువయ్యారు. వినాయకుడు... గజముఖుడు కావడానికి ముందున్న రూపాన్ని చూడాలని శివుణ్ణి పార్వతి కోరగా... ఆయన అనుగ్రహించాడు. దానితో మానవ ముఖంతో గణేశుడు ఇక్కడ వెలిశాడు. పూర్వరూపంతో కనిపించే గణపతి కాబట్టి ఆయనను 'ఆది వినాయకర్' అంటారు. వాస్తవానికి ఈ ఆలయంలో ప్రధాన దైవం ముక్తీశ్వరుడు. కానీ ఇది 'నర గణపతి ఆలయం'గానే ప్రసిద్ధి చెందింది. ముక్తీశ్వరుడు, ఆయన దేవేరి స్వర్ణవల్లి, నర గణపతితోపాటు ఈ ఆలయంలో సూర్య, చంద్రుల విగ్రహాలు కూడా పూజలు అందుకుంటున్నాయి.

సుమారు 1400 ఏళ్ళ క్రితంనాటి ఈ వినాయక ఆలయం పితృదోష నివారణ క్షేత్రంగానూ ఖ్యాతిగాంచింది. ప్రతినెలా అమావాస్య నాడు, మహాలయ పక్షాల్లోనే కాదు... సాధారణ దినాల్లో సైతం ఎంతోమంది ఈ ఆలయం సమీపంలో ఉన్న చంద్రతీర్థం అనే కొలనులో స్నానం చేసి, పిండప్రదానాలు చేసి, తర్పణాలు వదిలి... శివపార్వతులను, గణపతిని దర్శించుకుంటారు. దీని వెనుక కూడా ఒక పౌరాణిక గాథ ఉంది. శ్రీరాముడు తన తండ్రి దశరథుడికి దేశంలోని పలుచోట్ల పితృకర్మలు జరిపి, పిండప్రదానాలు చేశాడట. కానీ దశరథుడికి ముక్తి లభించకపోవడంతో... శివుణ్ణి ప్రార్థించాడట. ఈ చంద్రతీర్థంలో స్నానం ఆచరించి, పితృతర్పణాలు ఆచరించాలని శివుడు ఆదేశించడంతో... శ్రీరాముడు ఆ విధంగా చేసి తండ్రికి ముక్తి కలిగించాడట. తిలల (నువ్వుల)తో తర్పణాలు వదిలే చోటు కాబట్టి దీనికి 'తిలతర్పణపురి' అనే పేరు వచ్చింది. ఇక్కడ ఆచరించే కర్మల ద్వారా పితృదేవతలు సంతృప్తులవుతారని, తమ వారసులు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీస్సులు అందజేస్తారనీ, భక్తిశ్రద్ధలతో నరముఖ గణపతిని ఆరాధిస్తే అన్ని సమస్యలు, జీవితంలోని ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ప్రతినెలా సంకట హర చతుర్థి నాడు ఈ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయం తమిళనాడులోని కుంభకోణానికి 37 కిలోమీటర్ల దూరంలో ఉంది.

చలి కాలంలో వెచ్చని సూప్‌లు

చలి పెరిగినప్పుడు వెచ్చని సూప్ తాగాలనిపిస్తుంది. రకరకాల కాయగూరలతో చేసే సూప్‌లు ఆరోగ్యకరమైనవే కావు... తాగటానికి రుచిగా కూడా ఉంటాయి. అలాంటి కొన్ని సూప్‌లు ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...

కాలీఫ్లవర్ సూప్

కావాల్సిన పదార్థాలు:

తరిగిన కాలీఫ్లవర్ ముక్కలు- ఆరు కప్పులు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, తరిగిన బంగాళదుంప ముక్కలు- రెండు స్పూనులు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, నానబెట్టిన వాల్‌నట్స్- రెండు స్పూనులు, దాల్చినచెక్క పొడి- పావు స్పూను, నూనె- అర కప్పు,

ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

వాల్‌నట్స్‌ను వేడి నీళ్లలో 15 నిమిషాలు నానబెట్టాలి. పై తొక్కలు తీయాలి. తొక్క తీసిన వాల్‌నట్స్‌ను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. దానిలో నీళ్లు పోయాలి. పలచగా అయిన ఆ మిశ్రమాన్ని ఒక గిన్నెలో పోయాలి.ఒక మూకుడులో నూనెను వేసి వేడి చేయాలి. నూనెలో ఉల్లిపాయ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు, బంగాళదుంప ముక్కలు వేసి వేయించాలి. కొద్దిగా వేగిన తర్వాత దానిలో తగినన్ని నీళ్లు పోసి పైన మూత పెట్టాలి.ఇలా బాగా ఉడికిన ముక్కల్లో మూడొంతులు బయటకు తీసి, వాటిని మిక్సీలో ముద్దగా చేయాలి. ఆ తర్వాత ఈ ముద్దను మళ్లీ మూకుడులో వేయాలి. దానిలో వాల్‌నట్స్ మిశ్రమాన్ని పోసి, మూత పెట్టి ఉడకబెట్టాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ ఆదివారం 08 డిసెంబర్ 2024

ఆమెకు పుస్తకాలే పిల్లలు

ప్రొఫెసర్‌గా తరగతి గదిలో పాఠాలే కాదు... చక్కని రచనలతో గ్రంథకర్తగానూ పేరు గడించారు. పుస్తకాలే తన పిల్లలుగా... సాహిత్యమే తన లోకంగా జీవిస్తున్న డాక్టర్ కవితా భట్ కథ ఇది.

"జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగదు. ఎత్తుపల్లాలు... ఆటుపోట్లు... అన్నిటినీ తట్టుకొని ముందుకు సాగితేనే అనుకున్నది సాధించగలం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. ఉత్తరాఖండ్ తెహ్రీ గఢవాల్ జిల్లాలోని బౌన్సారా గ్రామం మాది. మా నాన్న బంకేలాల్ రతూరీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేసేవారు. ఆయన జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ పరిస్థితులూ అంతంతమాత్రమే. సంతానంలో నేనే పెద్ద. మా కోసం నాన్న పడుతున్న ఆవేదన, ఆందోళన నాకు అర్థమయ్యేది. నేనూ ఆయన కష్టాన్ని పంచుకోగలిగితే బాగుండని చిన్నప్పుడు ఎన్నో సందర్భాల్లో అనుకునేదాన్ని. వీటి నుంచి గట్టెక్కాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. బీఎస్సీ పూర్తయిన తరువాత ఫిలాసఫీ, యోగా, ఇంగ్లీష్, సోషల్‌వర్క్ సబ్జెక్టుల్లో మొత్తం నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించాను. లక్ష్యం వైపు పయనించాలంటే బలమైన పునాదులు ఉండాలి కదా. అందుకే ఇవన్నీ చదివాను. అంతేకాదు... సామాజిక అంశాలపై మరింత లోతైన అవగాహన కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ తదితర డిప్లమో కోర్సులతోపాటు పీహెచ్‌డీ కూడా చేశాను.

కఠిన పరీక్షలకు నిలిచి...

ఫిలాసఫీ, యోగా సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ పరీక్ష రాస్తే, అందులో అర్హత సాధించాను. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్' నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, జనరల్ రీసెర్చ్ ఫెలోషిప్. దాంతోపాటు యూజీసీ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... వేరొకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగిన ఒక మహిళగా నాలాంటివారికి ఆదర్శంగా నిలవాలనుకున్నాను. అందుకే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా తట్టుకొని చదువు కొనసాగించాను. ఆత్మస్థైర్యంతో అడుగులు వేసి ఇక్కడి వరకు రాగలిగాను. ప్రస్తుతం ఉత్తరాఖండ్ 'హేమవతీ నందన్ బహుగుణ గఢవాల్ సెంట్రల్ యూనివర్సిటీ' ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా.

ఎన్నో రచనలు...

ఒక పక్క విద్యా బోధన... మరోవైపు పుస్తక రచన చేస్తున్నా. సాహిత్య ప్రపంచంలో నాకంటూ కొన్ని పేజీలు ఉండాలనే తపన. ఇప్పటికి 27 పుస్తకాలు రాశాను. యోగిక్ స్టడీస్, సత్కర్మాస్, భారతీయ సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందులో ఉన్నాయి. అయితే నాకు బాగా పేరు తెచ్చిన రచనలు 'గీతా దర్శన్', 'భారతీయ సాహిత్య మే జీవన్ మూల్య'. వీటికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. యూపీలోని 'పటేల్ ప్రతినిధి సభ' వారు 'శైల్‌పుత్రి' బిరుదుతో గౌరవించారు.

2019లో మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ 'అఖిల్ భారతీయ ఆచార్య రామచంద్ర శుక్లా' పురస్కారంతో కలిపి ఇప్పటికి ముప్ఫైకి పైగా అవార్డులు అందుకున్నాను. ఇవి సాహిత్యం, సంస్కృతికి అందించిన సేవలకు నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

అక్షరంపై ప్రేమతో...

కొన్ని కారణాల వల్ల నేను తల్లిని కాలేకపోయాను. మాతృత్వపు మాధుర్యానికి నోచుకోనందుకు కొన్నాళ్లు బాధపడ్డాను. కానీ త్వరగానే దాని నుంచి కోలుకున్నాను. సాహిత్య లోకంలో విహరించడం ప్రారంభించాను. ఇప్పుడు నాకు పిల్లలు లేరన్న బాధ లేదు. ఎందుకంటే నా పుస్తకాలే నా పిల్లలు. నవ మాసాలు మోసి, బిడ్డను ప్రసవించడానికి ఎంత వేదన పడుతుందో... ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి అక్షర రూపం ఇచ్చి, పుస్తకంగా బయటకు తేవడానికి నేనూ అంతగా శ్రమిస్తాను. రచనలో మునిగిపోతాను. అంతే ప్రేమతో ప్రతి పుస్తకానికీ రూపం ఇస్తాను. ఎవరైనా నా రచనలను ప్రశంసిస్తే... అది నా బిడ్డకు దక్కిన అభినందన. ఒక తల్లిగా సంతోషిస్తాను.

సమాజం కోసం...

బోధన, సాహిత్యంలో ఎంతగా మునిగినా... ఈ సమాజంలో ఒక వ్యక్తిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారానికి రెండు రోజులు దీనికి కేటాయించాను. అలాగే అణగారిన వర్గాల పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నాను. మధ్యలో చదువు మానేసిన చిన్నారులను బడి బాట పట్టించేందుకు కృషి చేస్తున్నాను. ఎందుకంటే వారి జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. దానికి నన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి నింపుతున్నాను."

కొప్పున చందమామ

భుజాల మీదుగా వెంట్రుకలు పడితే ఉక్కపోత కారణంగా చిరాకుగా అనిపిస్తుంటుంది. అందుకే చాలా వరకు కేశాలను కొప్పులా ముడేయడానికి ఇష్టపడతారు మగువలు. మరి ఆ కొప్పు ఎలాంటి అలంకరణ లేకుండా ఉంటే వేడుకలో డల్ అవుతారు. సింపుల్ అనిపిస్తూనే చూపరులను ఇట్టే ఆకట్టుకునేలా కొప్పుకు నాజూకైన అలంకరణలు ఎన్నో వచ్చాయి. వాటిలో మీరు మెచ్చే కొప్పుల ఆభరణాలు ఇవి.

పూల మొగ్గలు/ఆర్టిఫిషియల్ గజ్రా... కొప్పున మల్లె మొగ్గలను సింగారించడానికి ఇప్పుడు చాలా భిన్నమైన, సులువైన పద్ధతులున్నాయి. హెయిర్ పిన్‌కి మల్లెలు చుట్టి వాటిని కొప్పులో క్రాస్‌గా గుచ్చితే చాలు. ప్లాస్టిక్ పువ్వుల కొప్పు దండ(గజ్రా)లూ ఉన్నాయి.

హెయిర్ పిన్... కొప్పులో సింగారించడానికి దువ్వెన పళ్ల మాదిరి ఉండే క్లిప్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని కొప్పుకు ఓ వైపుగా లోపలికి గుచ్చితే చాలు. బయటకు కనిపించే పిన్ డిజైన్ ఇట్టే ఆకట్టుకుంటుంది.

హెయిర్ బ్రూచ్... పమిటకు సింగారించే బ్రూచ్ స్టైల్ కేశాలంకరణకూ వచ్చాయి. ఇది ఒక పువ్వులా ఉండి కొప్పు మధ్యన చందమామలా మెరిసిపోతుంటుంది. హెయిర్ స్టిక్ /బాబ్ పిన్స్... ముడి వేశాక కురులు విడకుండా ఉండటానికి స్టిక్స్ అవసరం పడుతుంటాయి. వీటికీ డిజైనర్ టచ్ ఉండటంతో కేశాలంకరణలో ముదువరసలో ఉన్నాయి. హెడ్ పీస్... తల మీదుగానే కాదు కొప్పును కింద నుంచి అలంకరించే ఆధునికపు కేశాలంకరణ క్లిప్స్ వచ్చాయి. ఇవి వెస్ట్రన్ స్టైల్ కేశాలంకరణకు మరింత వన్నె తెస్తాయి.

చికెన్ ఘీ రోస్ట్

కావల్సినవి: చికెన్ - ముప్పావు కేజీ, గిలకొట్టిన పెరుగు - ముప్పావు కప్పు, కారం - చెంచా, పసుపు - అరచెంచా, నిమ్మరసం - పెద్ద చెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద - ఒకటిన్నర చెంచా, ఉప్పు - తగినంత.

మసాలాకోసం: ఎండుమిర్చి - ఆరు, మిరియాలు - అరచెంచా, మెంతులు - పావుచెంచా లవంగాలు - నాలుగు, జీలకర్ర, సోంపు - పావుచెంచా చొప్పున, ధనియాల పొడి - మూడు చెంచాలు, వెల్లుల్లి తరుగు - నాలుగు చెంచాలు, చింతపండు - ఉసిరికాయంత (వేడినీటిలో నానబెట్టుకోవాలి), బెల్లం తరుగు - రెండు చెంచాలు, నెయ్యి - అరకప్పు, ఉప్పు - తగినంత.

తయారీ: చికెన్ ముక్కల్ని శుభ్రం చేసి.. ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో పెరుగూ, కారం, పసుపూ, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి ముద్దా, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఇంతలో బాణలిని పొయ్యిమీద పెట్టి.. రెండు చెంచాల నెయ్యి వేయాలి. అది కరిగాక చింతపండూ, బెల్లం తరుగూ, ఉప్పూ తప్ప మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ వేసి వేయించి తీసుకోవాలి. వేడి చల్లారాక నీళ్లు చల్లుకుంటూ ముద్దలా చేసుకోవాలి. బాణలిని మళ్లీ పొయ్యిమీద పెట్టి.. పెద్ద చెంచా నెయ్యి వేయాలి. అది కరిగాక చికెన్ ముక్కలు వేసి మూత పెట్టాలి. చికెన్ ఉడికిందనుకున్నాక ఇవతలకు తీసేయాలి. అదే బాణలిలో మిగిలిన నెయ్యి వేసి ముందుగా చేసుకున్న మసాలా వేయాలి. దాని పచ్చివాసన పోయాక.. బెల్లం తరుగూ, కొద్దిగా చింతపండురసం, కొంచెం ఉప్పూ, చికెన్ ముక్కలూ వేసి.. బాగా కలపాలి. ఐదారు నిమిషాలయ్యాక దింపేస్తే చాలు.

జలుబుకు ఏ సూప్ మంచిదంటే!



వాతావరణంలో మార్పులు మన శరీరం మీద ప్రభావం చూపుతాయి. అవి, జలుబు, ఒళ్ళు నొప్పులతో కూడిన జ్వరం, దగ్గు రూపంలో బాధిస్తాయి. ఈ సమస్యల నుంచి ఉపశమనానికి, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఇంట్లోనే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. జులుబు, జ్వరం, దగ్గు సమస్యల ఉపశమనానికి...

చికెన్ సూప్: ఉల్లికాడలు, ఉల్లిపాయలు, మిరియాల పొడి కలిపి తయారుచేసుకున్న చికెన్ సూప్ జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలకు త్వరగా ఉపశమనం ఇస్తుంది.

మష్రూమ్/పాల కూర సూప్: శాకాహారులు పుట్టగొడుగులు, పాలకూరలతో సూప్‌లను తయారుచేసుకోవచ్చు. దీంట్లోనూ ఉల్లికాడలు, మిరియాలు, వెల్లుల్లి, జిలకర్ర కలిపి తయారుచేసుకొని సేవించాలి.

సూప్‌లు ఏ సమయంలోనైనా వేడి వేడిగా తీసుకుంటే రుచిగానూ ఉంటాయి. అనారోగ్యసమస్యల నుంచి సత్వర ఉపశమనం లభిస్తుంది.

వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే...

రోజూ ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు ఆరెంజ్ జ్యూస్ తీసుకోవాలి. దీంట్లో ఉండే 'సి' విటమిన్, యాంటీయాక్సిడెంట్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి.

ఈ సీజన్‌లో నీటి కాలుష్యం ఎక్కువ. వడకట్టడం, మరిగించి చల్లార్చిన నీళ్లు తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోతే విరేచనాలు అవుతుంటాయి. ఈ సమస్య దరిచేరకుండా ఉండాలంటే పెరుగు, మజ్జిగ వంటి ద్రవాలు తీసుకుంటూ ఉండాలి.

వారానికి ఒకరోజు లేదా 15 రోజులకొకసారి ఉపవాసం ఉండాలి. అంటే పూర్తిగా ఆహారం తీసుకోకుండా కాదు. ఆ రోజు మొత్తం కూరగాయలు, పండ్లు, పళ్ల రసాలు, నీళ్ల మీదే ఉండాలి. వేరే ఇతర ఆహార పదార్థాలేవీ తీసుకోకూడదు. దీని వల్ల శరీరంలో మలినాలు తొలగి, జీర్ణవ్యవస్థ పనితీరు చురుకు అవుతుంది. శరీరానికి అవసరమయ్యే మంచి బ్యాక్టీరియా శాతం పెరిగి అనారోగ్యసమస్యలు దరిచేరవు.

ఆరెంజ్ జ్యూస్, దానిమ్మ జ్యూస్‌లు ఈ కాలం చాలా మంచివి.

ఈ కాలం మూత్రవ్యవస్థకు సంబంధించిన సమస్యలు, ఇన్ఫెక్షన్లు అధికంగా వస్తుంటాయి. అలాగే - ఊపిరితిత్తులు, ముక్కుకు సంబంధించినవి, మలబద్ధకం సమస్యలకు అవకాశాలు ఎక్కువ. రోజులో 2-3 లీటర్లు శుభ్రమైన నీళ్లు సేవిస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ల సమస్య ఉండదు. పీచు పదార్థాలు ఎక్కువ ఉండే పదార్థాలు తినడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే విరేచనం సాఫీగా అవుతుంది.

కాయగూరల్లో బీట్‌రూట్, క్యారెట్ వంటి సూప్‌లను ఎర్రకందిపప్పును ఉపయోగించి తయారుచేసుకోవాలి. ఇది సలాడ్‌లా తయారుచేసుకొని భోజనంలా కూడా తినవచ్చు.టొమాటో రసం, టొమాటో పప్పు.. టొమాటోతో కూడిన వంటకాలు ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యకరం.

జీర్ణకోశం నుంచే రోగనిరోధక కణాలు పుడుతూ ఉంటాయి. అందుకని జీర్ణకోశాన్ని ఎంత జాగ్రత్తగా ఉంచుకుంటే ఈ కాలం అంత ఆరోగ్యంగా ఉంటాం అనే విషయాన్ని విస్మరించకూడదు.

క్యాన్సర్లను తరిమికొట్టే దానిమ్మ!



దానిమ్మ పండును క్రమం తప్పకుండా తినడం అంటే క్యాన్సర్‌ను దూరంగా తరిమికొట్టడమే. దానిమ్మలో ఉండే ప్యూనికలాజిన్ అనే అత్యంత శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఇందుకు కారణం. దానిమ్మలో విటమిన్ కె విటమిన్ బి5లతో పాటు విటమిన్ సి ఎక్కువ. ఫలితంగా దీన్ని తినడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, లుకేమియా వంటి అనేక క్యాన్సర్లు నివారితమవుతాయి. క్యాన్సర్ నివారణ మాత్రమే కాకుండా దానిమ్మతో ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాటిల్లో ఇవి కొన్ని...

?దానిమ్మలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫీనోల్స్, అనేక యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయి. ఇవన్నీ మనకు శక్తిమంతమైన రోగనిరోధక శక్తిని సమకూరుస్తాయి.

?దానిమ్మలో పీచుపదార్థం సమ వృద్ధిగా ఉంటుంది. అది జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మలబద్ధకం వంటి సమస్యలను దరిచేరనివ్వదు.

?డయాబెటిస్ రోగులకు ఎన్నో పండ్ల మీద ఆంక్షలుంటాయిగానీ.. దానిమ్మ విషయానికి వస్తే డయాబెటిస్ రోగులు దానిమ్మ తినాలంటూ డాక్టర్లే సూచిస్తారు.

?బరువు తగ్గించుకోవాలనుకున్నవారికి దానిమ్మ మంచి పండు. అది కొవ్వులను అదుపులో ఉంచి బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.

?కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతుంది. రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా ఇది ఇస్కిమిక్ కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి గుండెజబ్బులను నివారిస్తుంది. గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న వాళ్లు రోజూ ఒక గ్లాసు దానిమ్మరసం తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

-ఇది అధిక రక్తపోటు, అర్థరైటిస్, కీళ్లనొప్పులు, గుండెజబ్బులను నివారిస్తుంది.

-దానిమ్మ వల్ల చర్మానికి మంచి నిగారింపు వస్తుంది. చర్మకణాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. వయసు పెరిగేకొద్ది కనపడే ముడతలు, మచ్చలు, గీతలను నివారిస్తుంది. అందుకే దానిమ్మపండు తినేవారు దీర్ఘకాలం యౌవనంతో కనిపిస్తారు.

-వాపు, మంట, ఎర్రబారడం వంటి ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను త్వరగా తగ్గిస్తుంది.

త్వరలో ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా..!

న్యూఢిల్లీ-నవభూమి: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ మేజర్ ఎల్‌జీ అనుబంధ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా త్వరలో ఐపీఓకు రానున్నది. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ'కి ముసాయిదా పత్రాలు సమర్పించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఈ ఐపీఓ జరుగబోతున్నది. రూ.15,237 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళుతోంది. ఈ ఐపీఓలో ఎల్‌జీ ప్రమోటర్ సంస్థ 'ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐఎన్సీ 10.18 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, సిటీ గ్రూప్ బుక్, జేపీ మోర్గాన్ సంస్థలు ఐపీఓ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి. దక్షిణ కొరియా ఆటో మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27 వేల కోట్ల నిధులు సేకరించిన కొన్ని రోజులకే ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళ్లడం ఆసక్తికర పరిణామం. దేశంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా.. వాషింగ్ మిషన్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు విక్రయిస్తున్నది.

మారుతి కార్ల ధరలు మరింత పైకి 4 శాతం వరకు పెంచబోతున్న సంస్థ

న్యూఢిల్లీ-నవభూమి: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ కూడా కొనుగోలుదారులకు షాకిచ్చింది. నూతన సంవత్సరంలో వాహనాలు కొనుగోలు చేసేవారి జేబులకు మరిన్ని చిల్లులు పడనున్నాయి. జనవరి నుంచి కార్ల ధరలను 4 శాతం వరకు పెంచుతుండటమే ఇందుకు కార ణం. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే కార్ల ధరలు పెంచాల్సి వస్తున్నదని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆయా మాడళ్లు నాలుగు శాతం వరకు పెరగనున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకారణంగా సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా కొంతమేర ధరలు పెంచినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ ఆల్టో నుంచి మల్టీ-యుటిలిటీ వాహనమైన ఇన్విక్టో మాడల్‌ను దేశీయంగా విక్రయిస్తున్నది. ఇప్పటికే హ్యుండాయ్ మోటర్ రూ.25 వేల వరకు ధరలు పెంచగా, లగ్జరీ కార్ల తయారీ సంస్థయైన మెర్సిడెజ్-బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీలు తమ వాహన ధరలు పెంచుతున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి కూడా.
మహీంద్రా, ఎంజీ కూడా..మహీంద్రా, ఎంజీ మోటర్ కూడా వాహన ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించాయి. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు తెలిపింది. రవాణ ఖర్చులతోపాటు ఇతర ఖర్చులు పెరగడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది.

సూచీల వరుస ర్యాలీకి బ్రేక్ మార్కెట్లకు రుచించని ఆర్బీఐ నిర్ణయం

ముంబై-నవభూమి: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ వృద్ధిరేటు అంచనాను తగ్గిస్తూ రిజర్వుబ్యాంక్ ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా ఐదు రోజులపాటు లాభాల్లో కదలాడిన సూచీలు చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. 400 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 56.74 పాయింట్ల నష్టంతో 81,709.12 వద్ద ముగిసింది. గత ఐదు సెషన్లలో సూచీ 2,722.12 పాయింట్లు లేదా 3.44 శాతం లాభపడిన విషయం తెలిసిందే. మరో సూచీ నిఫ్టీ 30.60 పాయింట్లు కోల్పోయి 24,677.80 వద్ద స్థిరపడింది. సెంట్రల్ బ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించడంతో మార్కెట్లోకి మరిన్ని నిధులు చొప్పించనున్నది. తీవ్ర ఊగిసలాటలో కొనసాగిన షేర్లు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి.

బంగారం కడ్డీలపై హాల్‌మార్కింగ్!

న్యూఢిల్లీ-నవభూమి: బంగారం కడ్డీలపై కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన రత్నాలు-ఆభరణాల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. బంగారు ఆభరణాలపై 2021 నుంచి హాల్‌మార్కింగ్ తప్పనిసరిగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడటానికి, ముఖ్యంగా కొనుగోలుదారులకు నాణ్యమైనవి అందించాలనే ఉద్దేశంతో ఈ హాల్‌మార్క్‌ను తప్పనిసరి చేస్తున్నట్లు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ రంగం లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నాలుగేండ్ల క్రితం అమలులోకి వచ్చిన హాల్‌మార్కింగ్ విధానంతో 40 కోట్లకు పైగా బంగారు ఆభరణాలు హాల్‌మార్కింగ్ వేసుకున్నట్లు తెలిపారు. 2023లో 44 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ బంగారు, ఆభరణాల మార్కెట్ 2030 నాటికి 134 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తంచేశారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం ఎగుమతి కలిగిన భారత్..మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 3.5 శాతంగా ఉన్నదన్నారు. ఇప్పటి వరకు 1.95 లక్షల రిజిస్ట్రర్డ్ జ్యూవెల్లర్లు హాల్‌మార్కింగ్ ఆభరణాలను విక్రయిస్తున్నారు.

క్రెడిట్ కార్డ్ తెగ వాడేస్తున్నారా.. షాకింగ్ న్యూస్ మీకోసమే..

న్యూఢిల్లీ-నవభూమి: ప్రస్తుత కాలంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోతోంది. ప్రజలు తమ దైనందిన అవసరాలకే కాకుండా.. ప్రత్యేక రాయితీలు, రివార్డులు పొందేందుకు కూడా క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగిస్తున్నారు. ఈ క్రెడిట్ కార్డులు లావాదేవీలను సులభతరం చేయడమే కాకుండా.. ప్రజల ఆర్థిక ప్రొఫైల్‌ను కూడా బలోపేతం చేస్తాయి. వీటిని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే.. క్రెడిట్ హిస్టరీ స్ట్రాంగ్‌గా ఉంటుంది. తద్వారా క్రెడిట్ స్కోర్ కూడా భారీగా పెరుగుతుంది. అలా కాకుండా.. విచ్చలవిడిగా వినియోగించి, దుర్వినియోగం చేస్తే.. క్రెడిట్ హిస్టరీ దారుణంగా పడిపోవడంతో పాటు.. అధిక మొత్తంలో సమర్పించుకోవాల్సి వస్తుంది.
ఎవరైనా రుణం తీసుకోవాలంటే.. రుణదాతలు ముందుగా సదరు వ్యక్తి సిబిల్ స్కోర్/క్రెడిట్ హిస్టరీని చెక్ చేస్తారు. ఆ స్కోర్ ఆధారంగానే రుణాలు మంజూరు చేస్తారు. సిబిల్ స్కోర్ వ్యక్తి నిర్వహించే ఆర్థిక లావాదేవీలు, క్రెడిట్ కార్డ్స్ నిర్వహణ, చెల్లింపులపై ఆధారపడి ఉంటుంది. లోన్ తీసుకుని సకాలంలో చెల్లించడం, క్రెడిట్ కార్డ్ ద్వారా లావాదేవీలు జరిపి సకాలంలో చెల్లింపులు జరపడం ద్వారా సదరు వ్యక్తి సిబిల్ స్కోర్ పెరుగుతుంది. అలాకాకుండా.. క్రెడిట్ కార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, లోన్ రీపేమెంట్ సరిగా చేయకపోతే.. సిబిల్ స్కోర్ తగ్గిపోతుంది. దీని ఫలితంగా లోన్ రిజెక్ట్ అవడం గానీ, అధిక వడ్డీ రేట్లకు లోన్ మంజూరవడం గానీ జరుగుతుంది. అందుకే... క్రెడిట్ కార్డులను సరిగా మెయింటేన్ చేయడం చాలా ముఖ్యం.
వాస్తవానికి, వ్యక్తులు తమ క్రెడిట్ కార్డును ఉపయోగించినప్పుడు రుణదాత మీ ఖర్చు అలవాట్లు, చెల్లింపు హిస్టరీ, క్రెడిట్ వినియోగానికి సంబంధించిన పూర్తి డేటాను క్రెడిట్ బ్యూరో సిబిల్‌కి పంపుతుంది. దీని ఆధారంగా క్రెడిట్ బ్యూరోలు మీ క్రెడిట్ స్కోర్‌ను ఇస్తారు. సకాలంలో బిల్లులు చెల్లించడం ద్వారా మంచి క్రెడిట్ స్కోర్‌ను పొందవచ్చు. ఇది భవిష్యత్‌లో తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు పొందడంలో సహాయపడుతుంది. సిబిల్ స్కోర్/క్రెడిట్ స్కోర్ పెరగాలంటే.. బకాయిలను సకాలంలో చెల్లించడం చాలా ముఖ్యం. ఒక్క చెల్లింపు ఆలస్యమైనా.. దాని ప్రభావం మీ సిబిల్ స్కోర్‌పై పడుతుంది. ముఖ్యంగా.. 30 శాతం కంటే తక్కువ క్రెడిట్ వినియోగం మంచి సిబిల్ స్కోర్‌ని ఇస్తుంది. ఎప్పుడైనా మీకు అవసరమైనప్పుడు.. రుణం కోసం అప్లై చేస్తే రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌నే ప్రధానంగా చూస్తారు. క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే లోన్ మంజూరు చేస్తారు. మంచి క్రెడిట్ వినియోగ నిష్పత్తిని నిర్వహిస్తే.. ఈజీగా లోన్ మంజూరవుతుంది. అలా కాకుండా.. క్రెడిట్ కార్డులను ఇష్టారీతిని వినియోగిస్తే.. సిబిల్ స్కోర్ దారుణంగా పడిపోతుంది. పైగా రుణం పొందే అవకాశాలు కూడా తగ్గుతాయి.
మెరుగైన క్రెడిట్ స్కోర్‌ను కలిగి ఉండటం వల్ల తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా సిబిల్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే.. తక్కువ వడ్డీ రేట్లకే రుణం లభిస్తుంది. క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తున్న అదే బ్యాంకులో లోన్ కోసం అప్లై చేస్తే.. లోన్ తీసుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఇప్పటికే రుణం తీసుకుని.. ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లయితే.. మీ క్రెడిట్ స్కోర్ కూడా పెరుగుతుంది. ఇది భవిష్యత్‌లో పెద్ద మొత్తాన్ని పొందే అవకాశాలను కల్పిస్తుంది.

కొత్త కలర్ ఆప్షన్‌లో మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా.. మోటరోలా ఎడ్జ్ 50 నియో..!



న్యూఢిల్లీ-నవభూమి: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్లు కొత్త కలర్ ఆప్షన్ లో తీసుకొస్తున్నది. పాంటోన్ కలర్ మొచ్చా మౌజ్ రంగులో వచ్చే ఏడాది వస్తాయని తెలిపింది. మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ 6.9 అంగుళాల ఫుల్ హెచ్డీం ఎల్టీపీఓ పోలెడ్ మెయిన్ డిస్ ప్లే, 4-అంగుళాల కవర్ స్క్రీన్, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్ 6.4 అంగుళాల ఫ్లాట్ ఎల్టీపీఓ పోలెడ్ డిస్ ప్లే కలిగి ఉంటాయి.
మొచ్చా మౌజ్ కలర్ ఆప్షన్ లో వస్తున్న మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్లు సెలెక్టెడ్ గ్లోబల్ మార్కెట్లలో మాత్రమే లభిస్తాయి. భారత్ మార్కెట్లో లభిస్తుందా? లేదా? అన్న సంగతి వెల్లడి కాలేదు. మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ మిడ్ నైట్ బ్లూ, స్ప్రింగ్ గ్రీన్, పీచ్ ఫజ్ కలర్ ఆప్షన్లు, మోటరోలా ఎడ్జ్ 50 నియో పోన్ నాటికల్ బ్లూ, పయోంకియా, లాట్టే, గ్రిసైల్లె షేడ్స్ లో ఆవిష్కరించారు.
మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.99,999లకు లభిస్తుంది. 6.9 అంగుళాల ఫుల్ హెచ్డీం మెయిన్ స్క్రీన్, 4 అంగుళాల ఔటర్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ ఎస్వోసీ, 45 వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 4000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరాలు, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32-మెగా పిక్సెల్ కెమెరా ఉంటాయి.

భారీగా తగ్గిన బంగారం, వెండి అయితే..

న్యూఢిల్లీ-నవభూమి:దేశంలో బంగారం, వెండి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. యూఎస్ డాలర్ బలపడటం సహా పలు అంశాల నేపథ్యంలో వీటి ధరలు క్రమంగా పడిపోతు న్నాయి. అయితే నేడు ఏ మేరకు తగ్గాయి, ఎంత ఉన్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.
దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలో వీటి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. నిన్న పెరిగిన వీటి ధరలు, ఈరోజు మాత్రం తగ్గాయి. ఈ నేపథ్యంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 290 రూపాయలు తగ్గగా, మరోవైపు కిలో వెండి రేటు కూడా 200 పడిపోయింది. మరికొన్ని రోజుల్లో ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని పలువురు చెబుతుండగా, మరికొంత మంది మాత్రం పెరిగే ఛాన్స్ ఎక్కువ ఉందని అంచనా వేస్తున్నారు.
నేటి ధరలు ఎలా ఉన్నాయంటే..
ఈ క్రమంలో నేడు (డిసెంబర్ 7న) ఉదయం 6.25 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,610 స్థాయికి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 71,140కు చేరింది. మరోవైపు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 77, 760కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 71,290కి చేరుకుంది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి ధరల వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.
దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)
చెన్నైలో రూ. 77,610, రూ. 71,140
ముంబైలో రూ. 77,610, రూ. 71,140
ఢిల్లీలో రూ. 77, 760, రూ. 71,290
హైదరాబాద్‌లో రూ. 77,610, రూ. 71,140
విజయవాడలో రూ. 77,610, రూ. 71,140
వడోదరలో రూ. 77,660, రూ. 71,190
బెంగళూరులో రూ. 77,610, రూ. 71,140
కోల్‌కతాలో రూ. 77,610, రూ. 71,140
పూణేలో రూ. 77,610, రూ. 71,140
కేరళలో రూ. 77,610, రూ. 71,140
ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)
ఢిల్లీలో రూ. 91,900
సూరత్‌లో రూ. 91,900
ముంబైలో రూ. 91,900
తిరుపతిలో రూ. 100,900
హైదరాబాద్‌లో రూ. 100,900
విజయవాడలో రూ. 100,900
కేరళలో రూ. 100,900
వడోదరలో రూ. 91,900
పాట్నాలో రూ. 91,900
అహ్మదాబాద్‌లో రూ. 91,900
చెన్నైలో రూ. 100,900
కోల్‌కతాలో రూ. 91,900

108ను వెంటాడిన 100... క్లైమాక్స్‌లో షాకింగ్ ట్విస్ట్!

ముంబై-నవభూమి:రోడ్లపై అంబులెన్స్ వెళ్తుంటే వాహనదారులు దారి ఇవ్వాలని.. రోడ్డు ఇరుకుగా ఉన్న చోట తమ తమ వాహనాలు పక్కకు ఆపి, అంబులెన్స్ కు దారి ఇవ్వాలని అంతా కోరుతుంటారు.. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు చర్యలు కూడా తీసుకుంటున్నారు. అయితే... తాజాగా అంబులెన్స్ ను పోలీసులే వెంటాడి మరీ ఆపారు! దీనికి సంబంధించిన వీడియో షాకింగ్ గా ఉంది. హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవేపై 108 అంబులెన్స్ హల్ చల్ చేసింది. సినిమా షూటింగ్ అనుకునే స్థాయిలో వాతావరణం క్రియేట్ చేసింది. నేషనల్ హైవేపై అత్యంత వేగంగా సైరన్ వేసుకుంటూ అంబులెన్స్ వెళ్తుండగా.. దాని వెనుక ఛేజింగ్ సీన్ తరహాలో పోలీస్ వాహనం రయ్ రయ్ అంటూ వెంబడించింది. దీని వెనకున్న అసలు కథ ఏమిటనేది ఇప్పుడు చుద్దామ్! ఓ వ్యక్తి హైదరాబాద్ లోని 108 వాహనాన్ని హయత్ నగర్ లో చోరీ చేసి,ఖమ్మం మీదుగా విజయవాడకు హైవేపై ఈలేసుకుంటూ బయలుదేరాడు! దీంతో... విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనాన్ని తమ 100 వాహనంతో ఛేజ్ చేయడం మొదలుపెట్టారు. ఈ ఛేజింగ్ హయత్ నగర్ నుంచి నకిరేకల్ వరకూ జరగడం గమనార్హం! ఈ క్రమంలో చిట్యాల వద్ద అంబులెన్స్ ను ఆపడానికి ప్రయత్నించిన ఎస్సై జాన్ రెడ్డిని ఢీకొట్టి మరీ ఆ దొంగ అంబులెన్స్ తో దూసుకుపోయాడు. ఇదే తరహాలో కొర్లపహాడ్ టోల్ గేట్ వద్ద టోల్ గేట్ ను ఢీకొట్టి మరీ అంబులెన్స్ ను ముందుకు దూకించాడు ఆ దొంగ. అయితే ఆఖరికి టెకుమట్ల స్టేజ్ వద్ద దొంగను పట్టుకున్నారు. అది కూడా పుష్ప సినిమాలో ఎర్ర చందనం లారీలకు పోలీసులు ఎడ్ల బళ్లు అడ్డుబెట్టిన తరహాలో! అనంతరం అంబులెన్స్ దొంగను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో... అటు 108 సిబ్బంది, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ బిగ్ ట్విస్ట్ ఏమిటంటే... హయత్ నగర్ నుంచి అంబులెన్స్ ను దొంగిలించి విజయవాడ వైపు వయా ఖమ్మం తీసుకెళ్తున్న వ్యక్తి మతి స్థితిమితం లేనివాడని తేలిందంట! ఇతడు గతంలోనూ ఇదే విధంగా అంబులెన్స్ ను చోరీ చేసి తీసుకెళ్లాడని అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

దేశీయ సూచీలకు స్వల్ప నష్టాలు.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

న్యూఢిల్లీ-నవభూమి:లాభాల జోష్‌లో పయనించిన దేశీయ సూచీలు ఈ వారాన్ని స్వల్ప నష్టాలతో ముగించాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు ఆ తర్వాత తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశం నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా కొనసాగించింది. ఈ వారంలో బుల్ జోరు చూపిన సెనెక్స్, నిఫ్టీ చివరి రోజు స్వల్ప నష్టాలను చవిచూశాయి. గురువారం ముగింపు (81, 765)తో పోల్చుకుంటే 100 కు పాయింట్లకు పైగా లాభంతో శుక్రవారం ఉదయం మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభ నష్టాలతో దోబూచులాడింది. ఉదయం నష్టాల్లోకి జారుకుని 81, 506 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. ఆర్బీఐ మీటింగ్ తర్వాత తిరిగి లాభాల్లోకి ప్రవేశించింది. ఇంట్రాడే కనిష్టం నుంచి 400 పాయింట్లకు పైగా లాభపడి 81, 925 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు 56 పాయింట్ల స్వల్ప నష్టంతో 81, 709 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 20 పాయింట్ల లాభంతో రోజును ప్రారంభించింది. చివరకు 30 పాయింట్ల నష్టంతో 24, 677 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఎమ్‌సీఎక్స్ ఇండియా, పీబీ ఫిన్‌టెక్, వేదాంత, డెలివరీ షేర్లు లాభాలు అందుకున్నాయి. కాన్ ఫిన్ హెూమ్స్, కామ్స్, ఎమ్ అండ్ ఎమ్ ఫైనాన్సియల్, ఆల్కెమ్ ల్యాబ్స్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 263 పాయింట్ల లాభంతో ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ 94 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 84.69గా ఉంది.

సామాన్యులకు షాకింగ్.. రెపో రేటుపై ఆర్బీఐ కీలక నిర్ణయం...

న్యూఢిల్లీ-నవభూమి:భారతీయ రిజర్వ్ బ్యాంక్ వరుసగా 11వ సారి వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకూడదని నిర్ణయించింది. మూడు రోజుల సుదీర్ఘ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం తర్వాత, గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం డిసెంబర్ 6, 2024న వడ్డీ రేట్లను ప్రకటించారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తన పదవీ కాలం చివరి ఎంపీసీ సమావేశంలో మరోసారి సామాన్యుల అంచనాలను తలకిందులు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గవర్నర్ శుక్రవారం ప్రజల ముందుంచారు. ఈసారి కూడా రెపో రేటు పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇది గత 10 సమావేశాల నుంచి ఎటువంటి మార్పు లేకుండానే ఉంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి, ఆర్థిక వ్యవస్థను పెంచడానికి, నగదు నిల్వల నిష్పత్తిని ఇప్పుడు 0.50 శాతం తగ్గించారు. గత 10 సార్లు ప్రధాన పాలసీ వడ్డీ రేటు రెపో రేటును 6.5 శాతం వద్ద మార్చకుండా కొనసాగిస్తోంది. ఈ చర్య కారణంగా గృహ రుణ ఎటువంటి తగ్గింపు ఉండదు. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్య సమీక్షను సమర్పిస్తూ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ మేరకు ప్రకటించారు. ధరల స్థిరత్వం ప్రజలకు చాలా ముఖ్యమని, అయితే వృద్ధి కూడా ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలకు ద్రవ్యోల్బణం అంతిమ గమ్యం కష్టతరంగా మారుతుందని ఆయన అన్నారు. పాలసీ రెపో రేటును 6.5% వద్ద యథాతథంగా కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ 4:2 మెజారిటీతో నిర్ణయించిందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 | హైదరాబాద్ శనివారం 07 | డిసెంబర్ | 2024



74 ఏళ్ల వయస్సులో గుడ్డు పెట్టిన పక్షి

హోనలూలూ-నవభూమి: చిత్రంలో కనిపిస్తున్న పక్షి పేరు విజ్‌డమ్. ఇదో సముద్రపు పక్షి(ఇంగ్లిషలో దీనిని లేసన్ ఆల్బాట్రాస్ అంటారు). ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ వయస్సు కలిగిన సముద్రపు పక్షిగా ఇది రికార్డులకెక్కింది. దీని వయస్సు 74ఏళ్లు. అయితే, ఇక్కడ విచిత్రం ఇది మాత్రమే కాదు. ఈ వయసులోనూ అది గుడ్డు పెట్టింది. కొన్ని రోజుల్లో పిల్లను కనబోతోంది. ఈ పక్షుల సగటు జీవిత కాలం 68ఏళ్లే. విజ్‌డమ్ 74ఏళ్లు జీవించడమే రికార్డు అనుకుంటే.. ఈ వయస్సులో అది గుడ్డు పెట్టి పిల్లను కనబోతుండటం మరో గొప్ప విశేషం. విజ్‌డమ్ హవాయీ దీవుల్లోని ఓ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో అధికారుల పర్యవేక్షణలో ఉంది. లేసన్ ఆల్బాట్రాస్ పక్షులు ఏడాదికొకసారి ఒక్క గుడ్డు మాత్రమే పెడతాయి.

ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించిన ఎంవీఏ ఎమ్మెల్యేలు

ముంబై-నవభూమి: మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం కొలువుతీరడం, మూడు రోజుల అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారంనాడు ప్రారంభమైన నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈరోజు జరగాల్సిన ప్రమాణస్వీకారాన్ని 'మహా వికాస్ అఘాడి' ఎమ్మెల్యేలు బహిష్కరించారు. శివసేన నేత, మాజీ మంత్రి ఆదిత్య థాకరే ఈ విషయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యేలుగా దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ సహా పలువురు శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు.

''ఎంవీఏలో భాగమైన శివసేన (యూబీటీ) ఎమ్మెల్యేలు ఈరోజు అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయడం లేదు. ఈవీఎంలపై మాకు అనుమానాలు ఉన్నాయి. ఈ ఫలితాలపై ప్రజలు సంతృప్తిగా లేవు. ప్రజలిచ్చిన తీర్పే అయితే వారంతా సంతోషంగా ఉండేవారు. అలా జరగలేనందునే ఎక్కడా విజయోత్సవాలు కనిపించడం లేదు'' అని థాకరే అన్నారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైందని ఆరోపించారు.కాగా, బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే కాళిదాస్ కొలాంబ్కర్‌ను ప్రోటెం స్పీకర్‌గా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుక్రవారంనాడు నియమించారు. తక్కిన 287 మంది ఎమ్మెల్యేలతో ఆయన ప్రమాణస్వీకారం చేయిస్తారు. డిసెంబర్ 9న అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. దేవేంద్ర ఫడ్నవిస్ ప్రభుత్వంపై 'ట్రస్ట్ ఓట్', ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉంటుంది.

వామ్మో.. బాగానే పెరిగిందిగా.. మునక్కాయలు కిలో రూ.400

ముంబై-నవభూమి: ముఖ్యంగా, ఈ మార్కెట్‌కు పెరంబలూరు, ఒట్టాన్‌సత్రం, తేని, తిరునల్వేలి, విరుదాచలంతదితర ప్రాంతాల నుంచి మునక్కాయలు వస్తుంటాయి. ప్రస్తుతం సీజన్ ముగియడంతో మునక్కాయల దిగుమతులు తగ్గడంతో గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి మునక్కాయలు దిగుమతి చేసుకుంటున్నారు.

సాధారణంగా 300 నుంచి 400 టన్నుల మునక్కాయల విక్రయాలు జరుగుతుండగా, బుధవారం 50 టన్నులు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. దీంతో కిలో మునక్కాయలు రూ.350 నుంచి రూ.400 ధర పలికాయి. అదే సమయంలో కొద్ది నెలలుగా వెల్లుల్లి ధర కిలో రూ.450కి చేరుకున్న నేపథ్యంలో, మునక్కాయల ధరలు కూడా పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

12న సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు

చెన్నై-నవభూమి: ప్రయాణికుల సౌకార్యార్థం సికింద్రాబాద్-విల్లుపురం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.07601 సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు ఈ నెల 12న సికింద్రాబాద్ నుంచి రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.05 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది.మరుమార్గంలో నెం.07602 విల్లుపురం-సికింద్రాబాద్(ప్రత్యేక రైలు ఈ నెల 13న విల్లుపురంలో సాయంత్రం 4.05 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు తిరువణ్ణామలై, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు(%=వఅఱస్త్రబఱ్ఖు, +బఽబతీ, చీవశ్రీశ్రీశీతీవ%) మీదుగా వెళ్లనుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

తనఖా రహిత రుణ పరిమితి రూ.2 లక్షలకు పెంపు

ముంబై-నవభూమి: చిన్న, సన్నకారు రైతులకు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తీపి కబురు అందించింది. తనఖా రహిత రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని రుణ పరిమితిని సవరించినట్టు తెలిపింది. బ్యాంకుల వద్ద ఎటువంటి తనఖా లేకుండా రైతులు ఇప్పటివరకు రూ.1.6 లక్షల వరకే రుణాలు పొందే అవకాశం ఉన్నది.దీనిని ఇప్పుడు రూ.2 లక్షలకు పెంచింది. 2010 వరకు రైతుల రుణ పరిమితి లక్ష వరకే ఉండగా దానిని 2019లో రూ.1.6 లక్షలకు పెంచారు.

పట్టపగలు దారుణం.. మార్నింగ్ వాక్ వెళ్లిన వ్యాపారిపై కాల్పులు, హత్య

దిల్లీ-నవభూమి: ఢిల్లీలోని షహదారా ప్రాంతంలో శనివారం ఉదయం బుల్లెట్ల కాల్పులు చోటుచేసుకున్నాయి. షాహదారా విశ్వాస్ నగర్‌లో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఓ 52 ఏళ్ల వ్యాపారిని బైక్‌పై వెళ్తున్న దుండగులు కాల్చిచంపారు. దాదాపు 9 రౌండ్ల బుల్లెట్లు పేల్చారు. ఆ క్రమంలో అప్రమత్తమైన పలువురు ఆ వ్యక్తిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఇద్దరు దుండగుల కాల్పులు

మృతి చెందిన వ్యాపారి పేరు సునీల్ జైన్ (52). యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మార్నింగ్ వాక్ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. సీసీటీవీ ద్వారా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. బైక్‌పై వెళ్తున్న దుండగులు సునీల్‌ను లక్ష్యంగా చేసుకుని దాదాపు 9 రౌండ్లు కాల్పులు జరిపారు. అయితే ఈ ఘటన ఎందుకు జరిగిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాల్పుల ఘటన నేపథ్యంలో ఆయా పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెలకొంది.

జంగిల్ రాజ్

ఇప్పుడు షహదారాలో కాల్పులపై రాజకీయాలు కూడా వినిపిస్తున్నాయి. లా అండ్ ఆర్డర్ విషయంలో భారతీయ జనతా పార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి విరుచుకుపడింది. ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ, 'అమిత్ షా ఢిల్లీని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీని జంగిల్ రాజ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. ఇలాంటి ఘటనల వల్ల చుట్టుపక్కల ప్రజలు భయానక జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. బీజేపీ ఢిల్లీలో శాంతిభద్రతలను కాపాడటం లేదని, ఢిల్లీ ప్రజలు ఏకమై తమ గళాన్ని వినిపించాలని కోరారు. ఫిబ్రవరి 2025లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశ రాజధానిలో పెరుగుతున్న నేరాలు ఆమ్ ఆద్మీ పార్టీతోపాటు ఇతర పార్టీలకు కూడా కీలకం కానున్నాయి.

కక్షలు ఉన్నాయా...ఉదయం 8:36 గంటలకు బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు ఓ వ్యక్తిని కాల్చివేశారని మాకు పీసీఆర్ కాల్ వచ్చిందని షహదారా డీసీపీ ప్రశాంత్ గౌతమ్ తెలిపారు. వారు 3 నుంచి 4 సార్లు కాల్చివేశారని పేర్కొన్నారు. సునీల్ జైన్ ఒక క్రాకరీ షాప్ యజమాని. ఆయనకు ఎలాంటి బెదిరింపులు లేవని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటన ఫార్ష్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వాస్ నగర్‌లో జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే హత్య చేసిన వారు పాత కక్షల కారణంగా చేశారా ఇంకేదైనా కారణం ఉందా అనేది తేలాల్సి ఉంది.

అక్రమ గ్యాస్ సిలిండర్ గోదాములో పేలుడు.. ఆరుగురికి గాయాలు

లక్నో-నవభూమి: అక్రమంగా ఓ చోట గోదాములో ఎల్‌పీజీ సిలిం డర్లను రీఫిల్లింగ్ చేస్తున్నారు. అదే సమయంలో ఆకస్మాత్తుగా భారీ పేలుడు సంభవించింది. దీంతో ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ట్రామా సెంటర్‌లో చేర్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలోని దుబగ్గలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.వారం రోజుల క్రితం మర్దాపూర్‌లో నివాసం ఉంటున్న రోహిత్ గుప్తా ఇంట్లో ఈ ఎల్‌పీజీ అక్రమ గోదాం నిర్మించినట్లు పలువురికి తెలిసినట్లు డీసీపీ వెస్ట్ ఓంవీర్ సింగ్ పేర్కొన్నారు. ఆ క్రమంలోనే వారు శుక్రవారం రాత్రి వాణిజ్య సిలిండర్ల నుంచి డొమెస్టిక్ సిలిండర్లకు గ్యాస్ రీఫిల్ చేస్తున్నారు. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించిందన్నారు. పేలుడు చాలా శక్తివంతంగా జరగడంతో ప్రజలు తమ ఇళ్లలో నుంచి బయటకు వచ్చారని తెలిపారు. అంతేకాదు పేలుడు కారణంగా గోదాములోని గోడలకు పగుళ్లు కూడా ఏర్పడ్డాయని వెల్లడించారు.

ఆడుకుంటున్న చిన్నారులకు

ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడగా, పక్కనే ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులకు కూడా గాయాలయ్యాయి. గాయపడిన వారిలో మోహిత్ గుప్తా (24), శోభిత్ గుప్తా (22), సోమనాథ్ విశ్వకర్మ (33), రంజిత్, దిశాన్ (5), అయేషా (7) ఉన్నారు. ఘటన అనంతరం గోదాం యజమాని అశోక్ గుప్తా అక్కడి నుంచి పరారయ్యాడు. అగ్నిమాపక దళం, పోలీసు బృందాలు ఘటనా స్థలం నుంచి భారీగా గ్యాస్ సిలిండర్లను గుర్తించినట్లు డీసీపీ తెలిపారు. అయితే గ్యాస్ సిలిండర్ పేలలేదని ఆయన అన్నారు. సిలిండర్ పగిలి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని, ప్రస్తుతం కేసు విచారణ జరుగుతోందన్నారు.

పోలీసుల హస్తం ఉందా..

మరోవైపు గోదాము యజమాని ఎవరికీ అనుమానం రాకుండా కార్మికులను తరచూ మార్చేవారని స్థానికులు అంటున్నారు. అక్రమ గోదాం గురించి స్థానిక పోలీసులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ గోదాం నిర్వహణలో పోలీసుల హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ గ్యాస్ గోదాములను మూసివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దీంతోపాటు బాధ్యులైన అధికారులు, నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షిస్తే ఇలాంటి పరిణామాలే జరుగుతాయని అంటున్నారు. ప్రజలు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసి, ఇటు కార్మికుల భద్రత, సమీపంలోని ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల నేపథ్యంలో పోలీసులు

'ఇస్కాన్' ఆలయానికి నిప్పు.. విగ్రహాలు ఆహుతి



ఢాకా-నవభూమి: బంగ్లాదేశ్ లో ప్రార్థనా స్థలాలపై విధ్వంసకాండ ఆగడం లేదు. హిందువులు, మైనారిటీలపై దాడులు, ప్రార్థనా స్థలాల విధ్వంసంపై ఎల్లెడలా నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడంలో మహమ్మద్ యూనుస్ సారథ్యంలోని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ప్రముఖ హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు అనంతరం దాడులు మరింత ముమ్మరమయ్యాయి. కాగా, తాజాగా శనివారం తెల్లవారుజామున కొందరు దుండగులు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సమాజంకేంద్రానికి నిప్పుపెట్టారు. దీంతో ఆలయంలోని విగ్రహాలు అగ్నికి ఆహుతయ్యాయి. కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విషయాన్ని వెల్లడించారు.''బంగ్లాదేశ్‌లోని ఇస్కాన్ నామ్‌హట్ట కేంద్రానికి దుండగులు నిప్పు పెట్టారు. శ్రీ లక్ష్మీ నారాయణ్ విగ్రహంతో పాటు ఆలయంలోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి'' అని రాధారమణ్ దాస్ తెలిపారు. తెల్లవారుజామున 2-3 గంటల మధ్య దుండగలు శ్రీశ్రీ రాధాకృష్ణ ఆలయం, శ్రీశ్రీ మహాభాగ్య లక్ష్మీ నారాయణ్ ఆలయానికి నిప్పుపెట్టారని, ఇవి హరే కృష్ణ నామ్‌హట్టకు చెంది దౌర్ గ్రామంలో ఉన్నాయని, ఢాకా జిల్లా తురగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయని దాస్ పేర్కొన్నారు. ఆలయం వెనుక నుంచి పైకప్పును తప్పించి పెట్రోల్ జల్లి నిప్పించినట్టు తెలుస్తోందన్నారు. హిందూ కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుని దాడులు అప్రతిహతంగా జరుగుతున్నాయని, దాడుల తీవ్రతను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం దృష్టికి ఇస్కాన్ తీసుకువెళ్లినప్పటికీ పోలీసులు, అధికార యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్టు దాస్ ఆరోపించారు.బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం గత ఆగస్టులో కుప్పకూలి మహమ్మద్ యూనుస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మైనారిటీలు, ముఖ్యంగా హిందువులపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. గత నాలుగు నెలలుగా బంగ్లాదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇస్కాన్ ఆస్తులపై దాడులు జరుగుతున్నాయి. దీనిపై గత వారంలో భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళనను బంగ్లా సర్కార్ దృష్టికి తీసుకువెళ్లింది. బంగ్లాలోని మైనారిటీలు సహా ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదేనని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల లోక్‌సభలో ప్రకటన చేశారు. హిందూ సాధువు, ఇస్కాన్ మాజీ సభ్యుడు అయిన చిన్మయ్ కృష్ణదాస్‌ను నవంబర్ 25న ఢాకాలో అరెస్టు చేయడం తీవ్ర నిరసనలకు దారితీసింది. ఆయనకు బెయిలు నిరాకరిస్తూ కోర్టు జైలుకు పంపడంతో కోర్టు ఆవరణలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. చిట్టగాంగ్‌లో జరిగిన ఈ ఘర్షణల్లో అసిస్టెంట్ గవర్నర్ ప్రాసిక్యూటర్ సైఫుల్ ఇస్లాం అలిఫ్ మరణించాడు. కృష్ణదాస్ తరఫున న్యాయవాది ఎవరూ కోర్టుకు రాకపోవడంతో ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణను వచ్చే ఏడాది జనవరి 2వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

సున్నా కంటే తక్కువకు చేరుకున్న ఉష్ణోగ్రతలు.. వణికిపోతున్న జనాలు

శ్రీనగర్-నవభూమి: కశ్మీర్‌లో చలి తీవ్రత భారీగా పెరిగింది. ఎంత అంటే కనిష్ట ఉష్ణోగ్రత లోయ అంతటా గడ్డకట్టే స్థాయి కంటే దిగువన పడిపోయింది. కొన్ని ప్రదేశాల్లో అయితే సీజన్‌లోనే అత్యంత చలి స్థాయిలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. చలి ప్రభావం పెరగడంతో పొగమంచు కమ్ముకోవడం కూడా ఎక్కువైంది. దీంతో చలి నుంచి బయటపడేందుకు అక్కడి ప్రజలు భోగి మంటల సాయం తీసుకుంటున్నారు. జమ్మూ డివిజన్‌లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుంచి మైనస్ ఒకటి నుంచి మైనస్ ఆరు డిగ్రీలకు పడిపోయాయి. గురువారం రాత్రి శ్రీనగర్‌లో మైనస్ 4.1 డిగ్రీలతో ఈ సీజన్‌లో అత్యంత చలిగా ఉంది. జమ్మూ డివిజన్‌లోని బనిహాల్‌లో కూడా ఈ సీజన్‌లో తొలిసారిగా కనిష్ట పాదరసం సున్నా డిగ్రీల కంటే దిగువకు వెళ్లింది. వాతావరణ కేంద్రం శ్రీనగర్ ప్రకారం డిసెంబర్ 8 రాత్రి నుంచి డిసెంబర్ 9 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. డిసెంబర్ 10 నుంచి 14 వరకు వాతావరణం పొడిగా ఉంటుందని అంచనా వేశారు. డిసెంబర్ మధ్యలో కూడా వాతావరణం క్షీణించే అవకాశం ఉంది. డిసెంబర్ 15 నుంచి 16 వరకు తేలికపాటి వర్షాలు, మంచు కురిసే ఛాన్స్ ఉంది.దీంతోపాటు కశ్మీర్‌లోని మైదానాలు, కొండ ప్రాంతాల్లో కూడా విపరీతమైన చలి ఉంది. చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత కూడా సాధారణం కంటే 10 నుంచి 13 డిగ్రీల మధ్య స్థాయికి పడిపోయింది. శుక్రవారం ఎండా కాలంలో గరిష్ట ఉష్ణోగ్రత శ్రీనగర్‌లో 11.8 డిగ్రీల సెల్సియస్, పహల్గామ్‌లో 10.5, గుల్‌మార్గ్‌లో 4.0 డిగ్రీల సెల్సియస్. జమ్మూలో పగటిపూట చలి ఎక్కువగా ఉండదు. కానీ రాత్రి, ఉదయం వణుకు పెరిగింది. ఇక్కడ గరిష్ట ఉష్ణోగ్రత 22.2, కనిష్ట ఉష్ణోగ్రత 8.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గత రెండు రోజులుగా ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల కంటే తక్కువగా ఉంది. బనిహాల్‌లో 17.6 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 17.1, కత్రాలో 19.8, భదర్వాలో 16.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎక్కడ ఎంత ఉష్ణోగ్రత ఉందంటే..

లేహ్ మైనస్ 10.4
పహల్గామ్ మైనస్ 6.5
ఖాజిగుండ్ మైనస్ 4.4
గుల్మార్గ్ మైనస్ 4.3
శ్రీనగర్ మైనస్ 4.1
కుప్వారా మైనస్ 3.4
కోకర్నాగ్ మైనస్ 2.4
బనిహాల్ మైనస్ 2.6
భదర్వా 0.3
బ్యాట్ 1.9

మళ్లీ రైతాంగం భగ్గు

న్యూఢిల్లీ-నవభూమి: కనీస మద్దతు ధర (ఎంఎసపీ)కు కేంద్రం చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో రైతన్న మరోసారి గర్జించాడు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు శిబిరం నుంచి రైతులు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా పాదయాత్ర (జాతా) ప్రారంభించారు. కొంతదూరం సాగగానే హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. అయినా రైతులు అడుగు ముందుకేశారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఎనిమిది మంది రైతులు గాయపడ్డారు. దరిమిలా పాదయాత్రను శుక్రవారం ఒక్కరోజు నిలిపివేస్తున్నట్లు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. అంతకుముందు ఉదయం 101 మంది రైతులు తమ సంఘాల జెండాలను చేతబట్టి 'చలో ఢిల్లీ' పాదయాత్ర మొదలుపెట్టారు. అయితే పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి.. బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. 'సత్నాం వాహెగురూ' అని నినదిస్తూ రైతులు ముందుకు కదిలారు. బారికేడ్లను వారిలో కొందరు తొలగించారు. ఇనుప వలను గగ్గర్ నదిపై నిర్మించిన వంతెనపైకి విసిరేశారు. అయితే తొలి అంచె వరకే వారు ముందుకెళ్లగలిగారు. ఆ తర్వాత వారు అడుగు కూడా వేయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

ఓ రైతు సాహసంతో పోలీసు బలగాలు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక షెడ్‌పైకి ఎక్కాడు. టియర్ గ్యాస్ గోళాల ప్రయోగంతో పొగ సోకకుండా చాలా మంది రైతులు గోనె సంచులను కళ్లు, నోటికి అడ్డుపెట్టుకుని అటూ ఇటూ పరుగులు తీశారు. పోలీసులు నీటి ఫిరంగి వాహనాలను కూడా మోహరించారు. అంబాలా జిల్లా అంతటా నిషేధాజ్ఞలు విధించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. యాత్ర సాగే తొమ్మిది గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేశారు. దీంతో శుక్రవారం యాత్రను సస్పెండ్ చేస్తున్నట్లు రైతు సంఘం నేత సర్వన్‌సింగ్ పంధేర్ ప్రకటించారు. గాయపడిన ఆరుగురు రైతులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తాయన్నారు. ట్రాక్టర్‌ట్రాలీలను తీసుకురాకుండా యాత్ర చేపడితే తమకు అభ్యంతరం లేదని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన బీజేపీ నేతలు ప్రకటించారని.. ఇప్పుడు పాదయాత్రను కూడా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఇంకోవైపు.. ఖనౌరీ వద్ద చేపట్టిన తన ఆమరణ దీక్షను సంయుక్త కిసాన్ మోర్చా నేత జగ్జీత్‌సింగ్ దల్లెవాల్ శుక్రవారం కూడా కొనసాగించారు.

రైతుల డిమాండ్లు ఇవీ..

కనీస మద్దతు ధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని.. రైతు రుణాలను మాఫీ చేయాలని.. రైతులకు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని.. అన్నదాతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని.. కరెంటు చార్జీలు పెంచకూడదని.. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని.. 2020-21లో ఉవ్వెత్తున జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని.. యూపీలోని లఖీంపూర్ ఖేరీలో 2021లో చోటుచేసుకున్న హింసాకాండ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు శంభు, ఖనౌరీ వద్ద మకాం వేసి ఉద్యమిస్తున్నారు. ఫిబ్రవరి 18న కేంద్రప్రభుత్వ ప్రతినిధులు వారితో చర్చలు జరిపారు. ఆ తర్వాత వారి వద్దకు ఎవరూ రాలేదు. కాగా.. 'చలో ఢిల్లీ' యాత్రకు జైరాం రమేశ్ మద్దతు ప్రకటించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలన్నారు.

బోర్డర్‌లో బంగ్లాదేశ్ కవ్వింపు

న్యూఢిల్లీ-నవభూమి: సరిహద్దుల్లో బంగ్లాదేశ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. పశ్చిమ బెంగాల్‌కు సమీపంలో అత్యాధునిక బేరక్తర్ టీబీ2 డ్రోన్లను మొహరించింది. దీంతో వెంటనే అప్రమత్తమైన భారత్ సరిహద్దులో నిఘా పెంచింది. అయితే షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తర్వాత సరిహద్దు వెంట ఉగ్రవాద చర్యలు పెరుగుతున్నాయనే ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో ఆ డ్రోన్లను మొహరించినట్లు బంగ్లాదేశ్ చెబుతోంది. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, మన సరిహద్దుల భద్రత, రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సన్నద్ధంగా ఉన్నామని సీనియర్ రక్షణ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు భారత నిఘా వర్గాలు కూడా బోర్డర్ వెంట పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. హసీనా ప్రభుత్వ హయాంలో అణిచివేసిన ఉగ్రవాదులు ఇప్పుడు మళ్లీ సరిహద్దు సమీపంలో శక్తిపుంజుకుంటున్నారని నిఘా నివేదికలు వెల్లడిస్తున్నాయి. బోర్డర్ వెంట భారత్ వ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఓ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, కోల్‌కతాలో తాత్కాలిక డిప్యూటీ హైకమిషనర్ సిద్దర్ మొహమ్మద్ అష్రఫుర్ రెహమాన్, త్రిపురలోని డిప్యూటీ హైకమిషనర్ అరీఫుర్ రెహ్మాన్‌లను వెంటనే వెనక్కి వచ్చేయాలని బంగ్లాదేశ్ ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు నిరసనగా త్రిపుర రాజధాని అగర్తలలో తమ కార్యాలయం వద్ద హిందూ సంఘాల ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

9న బంగ్లాకు విదేశాంగ కార్యదర్శి

బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడుల నేపథ్యంలో ఆ దేశంతో చర్చలకు భారత్ సిద్ధమైంది. ఈనెల 9న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఆ దేశ విదేశాంగ కార్యదర్శితో చర్చలు జరుపుతారు. ఆ పర్యటనలో మరింత మంది అధికారులతో కూడా భేటీ అవుతారు. ఇరు దేశాల మధ్య నిర్మాణాత్మాక చర్చలు సాగుతాయనే ఆశాభావంతో ఉన్నట్లు విదేశీ వ్యవహారాల ప్రతినిధి జైశ్వాల్ చెప్పారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 హైదరాబాద్
శనివారం
07 డిసెంబర్ 2024

హీరోయిన్‌ను పెళ్లి చేసుకున్న 'కలర్ ఫొటో' దర్శకుడు

కలర్ ఫొటో సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, నటి చాందినీ రావు మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. తిరుమలలో వీరిద్దరి పెళ్లి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో సుహాస్ దంపతులతో పాటు నటుడు వైవా హర్ష తదితరులు హాజరై సందడి చేశారు. సందీప్ పెళ్లికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కలర్‌ఫొటో సినిమాతో డైరెక్టర్‌గా మంచి ఫేం సంపాదించాడు సందీప్ రాజ్ ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఛాయి బిస్కెట్‌లో షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ మొదలుపెట్టిన ఈ యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ డెబ్యూ సినిమాగా కలర్ ఫొటో ఓటీటీలో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది.

నటి చాందీని రావు విషయానికి వస్తే.. కలర్‌ఫొటో, రణస్థలి, హెడ్ అండ్ టేల్స్‌తోపాటు పలు వెబ్ సిరీస్‌లలో నటించించింది. చాందిని రావు ప్రొడక్షన్ హౌస్‌ను కూడా మెయింటైన్ చేస్తుంది. సందీప్ రాజ్ ప్రస్తుతం రోషన్ కనకాలతో సినిమా ప్రకటించాడని తెలిసిందే. ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ షురూ కానున్న ఈ చిత్రం 2025లో విడుదల కానుంది.



పుష్ప 2 'కిసిక్' - ఎక్కడ తేడా కొట్టింది?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2: ది రూల్ గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ప్రత్యేకంగా నార్త్ ఇండియా ప్రాంతాల్లో ఈ సినిమా అంచనాలకు మించి కలెక్షన్స్ సాధిస్తూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అయితే ఒక విషయంలో మాత్రం అనుకున్నంత రేంజ్ లో అంచనాలు అందుకోలేదని టాక్ వస్తోంది. పుష్ప 2 సినిమాలో శ్రీలీలపై తెరకెక్కించిన స్పెషల్ సాంగ్ 'కిసిక్' సినిమా విడుదలకు ముందే హైలైట్ అయినా, విడుదల అనంతరం ఈ పాటపై ప్రేక్షకుల నుండి అంత స్పందన రాలేదనే చెప్పాలి. అలా చేస్తే కలెక్షన్స్ ఒక రేంజ్ లో ఉండేవి 'కిసిక్' పాటను పార్ట్ 1లో వచ్చిన 'ఊ అంటావా మావా' పాటతో పోల్చుకుంటున్నారు. సమంత అద్భుతమైన హావభావాలు, పాటకు తగ్గట్టు ప్రెజెన్స్, అలాగే దేవిశ్రీ ప్రసాద్ అందించిన టెంపో ఆ పాటను విపరీతమైన విజయానికి దారితీసింది. కానీ ఈసారి 'కిసిక్' పాట ఆ స్థాయిలో ఆకట్టుకోలేదని చాలా మంది భావిస్తున్నారు. పాట టోన్, టెంపో, అలాగే డ్యాన్స్ మూవ్స్ సమంత సాంగ్ రేంజ్‌లో కాకపోవడం ఈ పాట బజ్ తగ్గడానికి కారణంగా చెబుతున్నారు. శ్రీలీల డ్యాన్స్ కూడా చక్కగానే ఉండగా, ఆమె కష్టపడిన విధానానికి ప్రేక్షకుల నుండి మంచి స్పందనను పొందింది. కానీ ఆ పాట విడుదల తర్వాత ఆమె హావభావాలు పెద్దగా చర్చకు రాలేదు. సమంత 'ఊ అంటావా' పాటలో తన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగా, శ్రీలీల 'కిసిక్' పాట ఆ రేంజ్ మ్యాజిక్ క్రియేట్ చేయలేకపోయిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పుష్ప 1లో సమంత పాట సినిమా విడుదల తర్వాత కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ, చాలాకాలం ప్రేక్షకుల మనసులో నిలిచిపోయింది. కానీ 'కిసిక్' పాట అయితే అటువంటి ప్రాచుర్యం పొందలేకపోయింది. పాటలో దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ బాగానే ఉన్నప్పటికీ, ప్రేక్షకులు 'ఊ అంటావా' పాటతో ఈ పాటను పోల్చడమే ఈ ఫలితానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒక స్పెషల్ ఐటమ్ సాంగ్ సినిమాకు ఎంత హైప్ కలిగించాలో 'ఊ అంటావా' సాంగ్ నిరూపించింది. కానీ ఈసారి 'కిసిక్' పాటకు ఆశించినంత బజ్ రావడం లేదని టాక్ ఉంది. దీనికి సాంగ్ లిరిక్స్, సంగీతం, మొత్తం ట్రీట్మెంట్ కూడా కారణమని సినీ విశ్లేషకులు అంటున్నారు. శ్రీలీల పాట విడుదల తర్వాత మిగతా ప్రమోషన్లలో భాగంగా కూడా పెద్దగా కనిపించకపోవడం, ఆమెపై దృష్టి మరింత తగ్గిపోయేలా చేసింది.

'పుష్ప 2' జాతర సీన్ చూసి మహిళలకు పూనిన అమ్మవారు..



అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పుష్ప ది రూల్' పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహించగా.. రష్మిక మందన్నా కథానాయికగా నటించింది. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. అయితే ఈ సినిమాలో సెకండ్ ఆఫ్‌లో వచ్చే 'గంగో రేణుక తల్లి' జాతర సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ జాతర ఎపిసోడ్‌లో అల్లు అర్జున్ మాస్ తాండవం చేశాడు. దాదాపు 30 నిమిషాలకు పైగా ఉన్న ఈ సీన్ బన్నీ కెరీర్‌కు హైలెట్‌గా నిలిచింది. అయితే ఈ జాతర సీన్ వచ్చినప్పుడు థియేటర్లలో పలువురు మహిళలకు అమ్మవారు పూనింది. జాతర పాట వస్తుంటే.. అమ్మవారు పూనడంతో పక్క సీట్లలో ఉన్న ప్రేక్షకులు వారిని శాంతింపజేశారు. కాగా.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి.

కుటుంబ అనుబంధాల భావోద్వేగాల పుష్ప - 2

అంతా తానై నడిపించిన బన్నీ

చిత్ర సమీక్ష

ఇది సీక్వెల్స్ సీజన్. వివిధ భాషల్లో సీక్వెల్స్ రావడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. దానికి తోడు సామాజిక మాధ్యమాలు వచ్చిన తరువాత అందరూ సమీక్షకులే. దానివల్ల అసలైన సమీక్ష ఏదో తెలియక సగటు ప్రేక్షకుడు గందరగోళానికి గురవుతున్నాడు. సమీక్ష అంటే కేవలం కథ మాత్రమే రాస్తే సరిపోదు. కథనాన్ని విశ్లేషించాలి.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప, పుష్ప -2 రెండింటినీ పోల్చి చూసినప్పుడు పుష్ప-2 కేవలం మాస్ చిత్రమే కాదు కుటుంబపరమైన అంశాలు కథనంలో మిళితమై ఉన్నాయి.

పుష్పరాజ్ ను కథానాయకుడిగా ఆవిష్కరించే క్రమంలో శ్రీవల్లి పాత్ర పుష్ప -2లో బాగా ఎలివేట్ అయ్యింది. శ్రీవల్లి చిన్న ఆశ కథ, కథనాలకు దారితీస్తుంది. ఈ చిత్రంలో ప్రతి దృశ్యంలో అంతా తానే అయి నడిపించాడు. అల్లు అర్జున్ పాత్ర నిండా ప్రేమ, రౌద్రం వంటి భావోద్వేగాలు ఉన్నాయి. ప్రతి నాయకుడు అసహనంతో చిందులు తొక్కుతుంటాడు. ఇద్దరి మధ్య వచ్చే దృశ్యాలు దర్శకుడి స్క్రీన్ ప్లే గొప్పదనాన్ని ప్రతిబింబించాయి. ఇక విశ్రాంతి ముందు వచ్చే సన్నివేశాలతో పాటు జాతర, చివరలో ఫైటింగ్ దృశ్యాలు కూడా ప్రేక్షకులను అలరిస్తాయి. కథ, కథనాలను నిశితంగా పరిశీలించినప్పుడు సుకుమార్ లో ఉండే కుటుంబ కథా రచయిత మనకు కనిపిస్తాడు.

చిత్రంలోని దృశ్యాలను సముద్రం మీద, చీకటిలో, అడవిలో చిత్రీకరించారు. ప్రేక్షకులు వాటిని చూసి ప్రేక్షకులకు ఒక హాలీవుడ్ చిత్రాన్ని చూస్తున్న భావన కలుగుతుంది. పుష్ప జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం వల్ల, పుష్ప -2కు అంతకన్నా ఎక్కువ ఖ్యాతి రావాలనే తపన దర్శక నిర్మాతలు ఈ చిత్ర నిర్మాణానికి పడిన శ్రమలో కనిపిస్తుంది. చిత్రం నిడివి మూడు గంటల 20 నిముషాలు ఉన్నప్పటికీ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా ఉండటం వల్ల ఎక్కువ సేపు కూర్చున్నామని అనిపించదు. శ్రీవల్లి పాత్రకు రష్మిక న్యాయం చేకూర్చారు. క్యారెక్టర్ నటుడు రావు రమేష్ ఈ చిత్రంలో తన పాత్రకు జీవం పోశారు. పుష్ప-2 చిత్రంలో అందరి కృషి మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

డా . దువ్వూరి సుబ్రహ్మణ్య శర్మ,
సినీ పరిశోధకులు.

అన్ స్టాపబుల్ బాలయ్య.. రాజమౌళికి హీరో.. సందీప్ సినిమాలో విలన్..!

నందమూరి బాలకృష్ణ హోస్ట్ గా చేస్తున్న అన్ స్టాపబుల్ సీజన్ 4 సక్సెస్ ఫుల్‌గా నడుస్తుంది. ఈ సీజన్ లో లేటెస్ట్‌గా యువ హీరో నవీన్ పొలిశెట్టి, స్టార్ హీరోయిన్ శ్రీలీల అతిథులుగా వచ్చారు. నవాన్ పొలిశెట్టి రావడం రావడమే బాలయ్య మీద ఒక కవిత చెప్పి ఆయన్ను ఇంప్రెస్ చేశాడు. అంతేకాదు బాల కృష్ణ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒక స్పెషల్ ఫోటో ఇచ్చాడు. ఇక ఆ తర్వాత షోలోకి శ్రీలీల కూడా వచ్చింది. నవీన్ పొలిశెట్టి తన కెరీర్ మొదట్లో జరిగిన విషయాల గురించి చెప్పుకొచ్చాడు. రణ్‌వీర్ సినిమాలో ఫోటో గ్రాఫర్ రోల్ అని అందరికీ చెప్పి అక్కడికి వెళ్తే తనలా 50 మంది ఉన్నారని అన్నాడు. మళ్లీ అదే రణ్ వీర్ చేతుల మీదుగా ఫిల్మ్ ఫేర్ అందుకున్నానని అని చెప్పుకొచ్చాడు నవీన్ పొలిశెట్టి. ముంబై వెళ్లడానికి ముందు ఇక్కడే ట్రై చేశా కానీ ఫ్రెండ్ సలహాతో ముంబై వెళ్లి అక్కడ యూట్యూబ్ వీడియోస్ చేశా ఆ వీడియో చూసి ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ ఆఫర్ వచ్చిందని అన్నాడు నవీన్. ఇక శ్రీలీల కూడా చిన్నప్పటి నుంచి డ్యాన్స్, యాక్టింగ్ మీద ఆసక్తి ఉందని చెప్పింది. సింగిల్ మదర్‌గా అమ్మ అన్ని విషయాల్లో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేదని చెప్పింది శ్రీలీల. ఇక ఇద్దరితో ఆటలు పాటలతో బాలకృష్ణ హుషారెత్తించారు. ఇక హార్ట్ బీట్ రౌండ్‌లో నవీన్‌కి రాజమౌళి సినిమా, సందీప్ వంగ సినిమా ఒకేసారి వస్తే ఏ సినిమా చేస్తావని అడిగారు బాలకృష్ణ. దానికి ఆన్సర్‌గా కాస్త తడబడ్డ నవీన్ రాజమౌళి మహేష్ సినిమాతో బిజీ కాబట్టి ప్రభాస్ సినిమా చేశాక సందీప్ సినిమా చేస్తా.. ఆ తర్వాత రాజమౌళి సినిమా చేస్తానని అన్నాడు. ఐతే అప్పుడు బాలకృష్ణ తానైతే రాజమౌళి సినిమాలో హీరోగా సందీప్ వంగ సినిమాలో విలన్‌గా చేస్తానని అన్నారు. యువ హీరోయిన్స్‌లో తనకు శ్రీలీల అంటే ఇష్టమని నవీన్ చెప్పగా.. విశ్వక్, సిద్ధు, విజయ్ దేవరకొండ, నవీన్ పొలిశెట్టి, అడివి శేష్‌లో శ్రీలీల రేటింగ్ ఎవరికి ఎలా అంటే.. నవీన్ పేరు ముందు చెప్పి ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేనని చెప్పింది శ్రీలీల. ఇక తన జీవితంలో అన్ స్టాపబుల్ మూమెంట్ గురించి నవీన్ చెప్పాడు. ఒక టైంలో నవీన్ రెంట్ కట్టకపోతే రూంలో నుంచి వెళ్లమని చెబుతామని ఫ్రెండ్స్ డిసైడ్ అయినప్పుడు తనకు గీతలోని ఒక మాట బాగా నచ్చిందని.. ఫలితం ఆశించకుండా కష్టాన్ని నమ్ముకుంటే లక్ష్యం వైపు వెళ్తామని ఆ మాటతో తనలో మార్పు వచ్చిందని అన్నారు.

మూడో వికెట్ కోల్పోయిన టీమిండియా.. 66 పరుగుల వద్ద విరాట్ అవుట్

న్యూదిల్లీ-నవభూమి: బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ ఓవల్ స్టేడియంలో జరుగుతున్న డే-నైట్ టెస్ట్‌లో టీమిండియా ఎదురీదుతున్నది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో టీమిండియా బ్యాటర్లు తడబడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆల్ అవుట్ అయిన టీమిండియా.. రెండో ఇన్నింగ్స్‌లో కష్టాల్లో ఉన్నది. ఇప్పటికే ఓపెనర్లు ఇద్దరు అవుట్ అవగా.. సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ వికెట్‌ను సైతం టీమిండియా కోల్పోయింది. 66 పరుగుల వద్ద విరాట్ (11) స్కాట్ స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో.. అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ప్రస్తుతం రిషబ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం టీమిండియా 70కిపైగా పరుగులు వెనుకపడి ఉన్నది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 180 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 337 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. ప్రస్తుతం టీమిండియా మూడు వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (28), రిషబ్ పంత్ (7) బ్యాటింగ్ క్రీజులో ఉన్నారు. ఆస్ట్రేలియాలో బౌర్లలో బోలాండ్‌కు 2 వికెట్లు, కమ్మిన్స్‌కు ఒక వికెట్ దక్కింది.

కష్టాల్లో టీమిండియా.. ఇద్దరు ఓపెనర్లు అవుట్..

న్యూదిల్లీ-నవభూమి: బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ ఓవల్‌లో జరుగుతున్న డే-నైట్ టెస్ట్ సిరీస్‌లో టీమిండియా కష్టాల్లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌ను ప్రారంభించిన టీమిండియాకు ఆస్ట్రేలియా బౌలర్లు వరుస షాక్ ఇచ్చారు. మ్యాచ్‌లో ఇద్దరు ఓపెన్లు ఔట్ అయ్యారు. 42 పరుగుల వద్ద యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను బోలాండ్ అవుట్ చేశాడు. జైస్వాల్ 31 బంతుల్లో 24 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరుకున్నాడు. విరాట్ కోహ్లీ నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ క్రీజులో ఉన్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 12 పరుగుల భారత్‌కు తొలి దెబ్బ తగిలింది. కేవలం ఏడు పరుగులు చేసి.. పెవిలియన్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో పట్టు సాధించాలంటే టీమిండియా తప్పనిసరిగా వికెట్ నష్టపోకుండా భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో 337 పరుగులు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (17), విరాట్ (5) క్రీజులో ఉండగా.. భారత్ స్కోరు రెండు వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది. ప్రసుతం టీమిండియా 100 పరుగులు వెనుకపడి ఉన్నది.

ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని ఆస్ట్రేలియాకు పంపాలి.. టీమ్ మేనేజ్‌మెంట్‌కు మాజీ కోచ్ శాస్త్రి అడ్వైజ్..!

న్యూదిల్లీ-నవభూమి: బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్ నేపథ్యంలో టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నది. అయితే, ఈ సిరీస్‌లో బౌలింగ్ భారమంతా మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాపైనే పడుతున్నది. ఈ క్రమంలో మాజీ కోచ్ రవిశాస్త్రి టీమ్ మేనేజ్‌మెంట్ కీలక సూచనలు చేశాడు. బుమ్రాపై భారాన్ని తగ్గించేందుకు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని వీలైనంత త్వరగా ఆస్ట్రేలియాకు పంపాలని చెప్పాడు. షమీ ప్రస్తుతం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పాల్గొంటున్నాడు. నేషనల్ క్రికెట్ అకాడమీ మెడికల్ టీమ్, బీసీసీఐ సెలెక్టర్లు షమీ ఫామ్‌ని నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో భారత జట్టు ఆడుతున్నది. ఈ సందర్భంగా రవిశాస్త్రి సూచనలు చేశాడు. షమి చాలానే దేశవాళీ క్రికెట్ ఆడాడని.. బుమ్రా బౌలింగ్‌లో ప్రత్యర్థి జట్టు ఎంత ఒత్తిడికి గురవుతుందో చూడొచ్చని.. అతనిపై భారీగా ఒత్తిడి ఉందని తెలిపాడు. షమీ బెంగాల్ తరఫున దేశవాళీ టీ20 టోర్నీలో ఏడు మ్యాచులు ఆడి ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. పలు అద్భుతమైన స్పెల్స్ ఉన్నాయి. ఈ నెల 14 నుంచి 18 మధ్య బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్‌కు షమీ అందుబాటులో ఉంటాడని ప్రకటించడం తొందరపాటవుతుందని మాజీ కోచ్ చెప్పుకొచ్చాడు. మెల్‌బోర్న్, సిడ్నీ టెస్టులకు షమీ అందుబాటులో ఉండవచ్చన్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**